


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 157 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 18 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 157 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD SAT 18 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

### లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి

## పూర్తి బాధ్యత బీజేపీదే

- డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి
- బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ
- ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన



**హైదరాబాద్ పెన్ పవర్:**లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు.

మిగతా 2లో



## ఇపుడు ప్రజలు గుర్తొచ్చారా.?

- కేటీఆర్ పాదయాత్రపై కవిత కౌంటర్
- కేటీఆర్ ను టార్గెట్ చేస్తూ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత
- పదేళ్లుగా కేటీఆర్ ప్రజల్లోకి ఎందుకు వెళ్లలేదన్న కవిత
- ఇప్పుడు పాదయాత్ర చేస్తానంటే ఎవరు నమ్ముతారని ఎద్దేవా
- అందరికీ అధికారం కావాలని తాను అన్న తర్వాతే కష్టాలు మొదలయ్యాయని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర ప్రకటనపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కౌంటర్ వేశారు. పదేండ్లు అధికారంలో ఉండి ప్రజల్లో ఉండలేదు

మిగతా 2లో

### 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్

# కొనుగోలు చేయండి..

## కేంద్రమంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి

- ధాన్యం సేకరణ కోసం కేంద్రమంత్రిని కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రమంత్రి జోషితో రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ
- 30 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ధాన్యం సేకరించాలని విజ్ఞప్తి
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులపై చర్చ





**హైదరాబాద్ పెన్ పవర్:**యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు తెలంగాణ అనుకూలమని కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని చెప్పారు. ఏప్రిల్ 17న మంత్రి ఉత్తమ్ తో కలిసి సీఎం రేవంత్ ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని వివరించారు. యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, అందువల్ల యాసంగి పంటకు సంబంధించి మొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రికి చెప్పారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి సీఎం రేవంత్ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.

2014--15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన


## భారత ప్రజాస్వామ్యానికి ఏప్రిల్ 17 చీకటి రోజు

### ప్రతిపక్ష కూటమిపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ప్రజాస్వామ్యానికి ఏప్రిల్ 17 చీకటి రోజు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశంలోని ప్రతి తల్లి, అక్క, చెల్లి, కుమార్తెకు ఇది అవమానకర దినమన్నారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిన నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. " కాంగ్రెస్ 'ఇండి' కూటమి అసలు రంగు బయటపడింది. మహిళా రిజర్వేషన్లపై

మిగతా 2లో




## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

- అరేబియా సముద్రంలో క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు వెల్లడి
- ఈ నెల 20 నుంచి 21 వరకు పాకిస్థాన్ నోటమ్ జారీ
- ఈ నెల 22 నుంచి 25 వరకు భారత్ నోటమ్ జారీ

మిగతా 2లో

### ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు

## బాంబు బెదిరింపు



- మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి
- పోలీసులకు సమాచారం అందించిన మెట్రో సిబ్బంది
- తనిఖీలు నిర్వహించగా లభ్యం కాని అనుమానాస్పద వస్తువులు

మిగతా 2లో

### మీకు మహిళల ఉసురు

## తగులుతుంది

### విపక్షాలపై అమిత్ షా ఫైర్



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ
- విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

**పెన్ పవర్ డెస్క్:**మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం

మిగతా 2లో

## చైర్మన్‌గా భట్టి విక్రమార్క..

### సభ్యులుగా నలుగురు మంత్రులు



**హైదరాబాద్ పెన్ పవర్:**ఉన్నత విద్యాసంస్థల్లో వివక్షను అరికట్టేందుకు రోహిత్ వేముల పేరుతో తీసుకువస్తున్న బిల్లుపై అధ్యయనం చేసి, సూచనలు ఇవ్వడానికి ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చైర్మన్‌గా నియమించగా..

మిగతా 2లో

### మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్

# బిల్లులకు బ్రేక్...

### లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు



- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు

**పెన్ పవర్ డెస్క్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన

మిగతా 2లో



### రాజ్యాంగంపై దాడిని

## అడ్డుకున్నాం

### కీలక బిల్లు ఓటమిపై రాహుల్ గాంధీ


- లోక్‌సభలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోయింది
- బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు.. మెజారిటీకి 60 ఓట్ల దూరంలో ఓటమి
- మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను అడ్డుకున్నామన్న రాహుల్ గాంధీ
- డెలిమిటేషన్‌తో రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది

**పెన్ పవర్ డెస్క్:**కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా

మిగతా 2లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

### హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన



- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ అధికారిక ప్రకటన

మిగతా 2లో

### చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై

## పూర్తి వివరాలు బయటపెడతా



- చెవిరెడ్డి కుటుంబ అవినీతికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయన్న పులివర్తి నాని
- వారం రోజుల్లో సినిమా చూపిస్తా అంటూ వార్నింగ్
- చెవిరెడ్డి కొడుకు మోహిత్ రెడ్డివి పిల్ల చేష్టలని ఎద్దేవా
- జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శ

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# డీలిమిటేషన్‌తో దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరిస్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాథం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది. ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ౹ఈఖీ (౹నీబిజీశ్రీ టవతీబితిశ్రీతిబిఎ ఖీజీబివ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి.

అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల పంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకసభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. దక్షిణాది రాష్ట్రాలలో కొద్దో గొప్పో పెరుగనున్నాయి.. ఈ పరిస్థితులను రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలలో తమ ప్రధాన అస్త్రంగా ఉపయోగించుకోవడానికి, ఇప్పటినుండే కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఒకవైపు 2011 జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన లోకసభ సమా వేశాలలో ప్రవేశ పెట్టే బిల్లును లోకసభ సభ్యులకు చేర వేశారు. మరోవైపు 2026 జనాభా ఆధారంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పిస్తామని సదరు బిల్లులో చేర్చారు. రానున్న కాలంలో దేశంలో ఉత్తర దక్షిణాది రాష్ట్రాల మధ్య దూరం పెరగడమే కాకుండా, దేశ ఐక్యతకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉన్నది.

## చెవిరెడ్డి కుటుంబం అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు బయటపెడతా

తిరుపతి వేదికగా సాగుతున్న రాజకీయ పోరు ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. చంద్రగిరి వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుటుంబంపై టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని విరుచుకుపడ్డారు. చెవిరెడ్డి కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలపై తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని, వారం రోజుల్లోనే చెవిరెడ్డికి 'సినిమా చూపిస్తా' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా తండ్రి పేరు చెప్పుకుని కోట్లు సంపాదిస్తూ, గర్వంతో ఊగిపోతున్నారంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై మండిపడ్డారు. మోహిత్ రెడ్డి చేసేవి చిన్నపిల్లల చేష్టలని, తమ నాయకుడు నారా లోకేశ్ పేరు ఎత్తితే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన తెగేసి చెప్పారు. లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్నారని, ఆయన పనితీరును విమర్శించే స్థాయి మోహిత్ రెడ్డికి లేదని నాని ధ్వజమెత్తారు. వెన్నుపోటు రాజకీయాలకు చెవిరెడ్డి కుటుంబమే బ్రాండ్ అంబాసిడర్ అని పులివర్తి నాని ఎద్దేవా చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి వంటి నేతలనే కాకుండా, చివరకు జగన్‌ను కూడా మోసం చేసిన చరిత్ర ఆ కుటుంబానిదని విమర్శించారు. మద్యం డబ్బులు లెక్కిస్తున్న వీడియోల్లో కనిపిస్తున్న కోట్లాది రూపాయల నగదు ఎక్కడి నుంచి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుడా వ్యవహారంలో జరిగిన భారీ అవినీతిపై విచారణ వేగంగా సాగుతోందని, అవినీతికి సహకరించిన ఏ అధికారిని వదిలిపెట్టేది లేదని, వారం రోజుల్లోనే సస్పెన్షన్లు మొదలవుతాయని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తలను భయపెట్టడం ఎవరి వల్ల కాదని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు తాను దూరంగా ఉన్నానని, కానీ తమపై అభాండాలు వేస్తే సహించబోనని స్పష్టం చేశారు.

# లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే

- మొదటి పేజి తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు.ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి**

మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడం కుదరదనే విషయం ఈరోజు లోక్ సభలో జరిగిన పరిణామాలను బట్టి బీజేపీ తెలుసుకోవాలని

అన్నారు. దీనితో పాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా రాష్ట్ర హక్కు అని కేటీఆర్ అన్నారు.జమ్ము కశ్మీర్, అసోంలో దేశవ్యాప్త డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో, దేశవ్యాప్త డీలిమిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయండి..

- మొదటి పేజి తరువాయి

రూ. 1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గాను పోషకాహార బియ్యాన్ని (ఖీ=ఖ) పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్ పరిధిలో పంపిణీ చేసేవారని, ఇటీవల దానిని నిలిపివేశారని పేర్కొంటూ వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# చైర్మన్‌గా భట్టి విక్రమార్క..

- మొదటి పేజి తరువాయి

సభ్యులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీ విద్యాసంస్థల్లో జరుగుతున్న వివక్షపై ప్రస్తుత పరిస్థితులను సమీక్షించి, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలులో ఉన్న చట్టాలను పరిశీలించి, తెలంగాణకు అనుకూలంగా సమగ్ర చట్టం రూపొందించేందుకు సూచనలు ఇవ్వనుంది. అలాగే.. విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ, పర్యవేక్షణ యంత్రాంగం, కఠిన చర్యల విధానం వంటి అంశాలపై సిఫారసులు చేయాల్సి ఉంటుంది. వీలైనంత త్వరగా కమిటీ నివేదిక సమర్పించాలని ఆదేశించింది. నివేదిక ఆధారంగా బిల్లును తుది రూపంలో సిద్ధం చేసి, శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశమున్నది. ఈ బిల్లు అమల్లోకి వస్తే, విద్యార్థుల హక్కులకు మరింత బలమైన రక్షణ లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# భారత ప్రజాస్వామ్యానికి ఏప్రిల్ 17 చీకటి రోజు

- మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ కాలకూట విషం కక్కింది. మహిళల హక్కులను కబళించడం రాజకీయ పాపం. దేశంలో మహిళలందరినీ ఓడించినందుకు సంబురాలు చేసుకుంటారా? దేశ మహిళలు త్వరలోనే కాంగ్రెస్ కూటమిని ఓడించి సంబురాలు చేసుకునే రోజులు రాబోతున్నాయి.కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మహిళా వ్యతిరేకి. మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలన్నీ కుటుంబ పార్టీలే. సాధారణ మహిళలకు చట్టసభల్లో వాటా ఇస్తుంటే ఓర్వలేక బిల్లును అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహులే. అధికారంలో ఉన్నంత కాలం మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి వంచించారు. దేశ ప్రజలు కాంగ్రెస్‌ను పదేపదే ఓడిస్తూ ఛీ కొడుతున్నా.. వారికి జ్ఞానోదయం కలగడం లేదు. బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే-కాంగ్రెస్, టీఎంసీలను చిత్తుగా ఓడించండి. కాంగ్రెస్ కూటమికి మహిళా శక్తి అంటే ఏమిటో చాటి చెప్పండి" అని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# ఇపుడు ప్రజలు గుర్తొచ్చారా.?

- మొదటి పేజి తరువాయి

కానీ..ఇపుడు ప్రజలను చూసేందుకు పాదయాత్ర చేస్తారా అని సెటైర్ వేశారు.

శనిపోవాలనే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని చెప్పారు కవిత. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరానన్నారు. బీఆర్ఎస్ లోని కొంత మంది మాజీ ఎమ్మెల్యేలు తనతో టచ్ లో ఉన్నారని చెప్పారు. ఆ మాజీ ఎమ్మెల్యేలు ఎవరనేది పేర్లు చెప్పబోనన్నారు. తొలుత బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేశా..ఇపుడు అధికార పార్టీని టార్గెట్ చేస్తున్నా.. ప్రజా సమస్యలను తీర్చేది అధికార పార్టీనే అన్నారు. ఇష్యూను బట్టి బీఆర్ఎస్ ను కూడా టార్గెట్ చేస్తానన్నారు కవిత.

త్వరలో ప్రజాసమస్యలపై పాదయాత్ర చేస్తానని కేటీఆర్ ఏప్రిల్ 12న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కవిత కేటీఆర్ పై విమర్శలు చేశారు.

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

## హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన

ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హర్మ్యూజ్ ను పూర్తిగా తెరిచినట్టు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం అధికారికంగా వెల్లడించారు."లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మ్యూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మ్యూజ్ జలసంధి అత్యంత

వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## క్షిపణి పరీక్షల కోసం ఒకేసారి 'నోటమ్' జారీ చేసిన భారత్, పాకిస్థాన్

అరేబియా సముద్రంలో క్షిపణి విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు భారత, పాకిస్థాన్ దేశాలు ఒకేసారి నోటమ్ (నోటీసెస్ టు ఎయిర్‌మెన్) జారీ చేశాయి. క్షిపణి ప్రయోగాలు చేపట్టనున్నట్లు ఇరుదేశాలు తెలిపాయి. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని ఆయా దేశాలు నోటమ్, మారిటైమ్ అడ్వైజరీ వంటివి జారీ చేయడం సహజమే. అయితే ఇప్పుడు రెండు దేశాలు ఒకేసారి నోటమ్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది.ఏప్రిల్ 20 తెల్లవారుజామున 3 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. 200 కిలోమీటర్ల మేర క్షిపణి విన్యాసాల జోన్‌గా పాకిస్థాన్ ప్రకటించింది.అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి

ఏప్రిల్ 25న రాత్రి 9.30 గంటల వరకు సుదీర్ఘ విన్యాసాలకు హెచ్చరికలు జారీ చేసింది. భారత్ 400 కిలోమీటర్ల మేర క్షిపణుల విన్యాసం కోసం జోన్‌గా ప్రకటిం చింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన సంవత్సరం తర్వాత ఇరుదే శాలు ఆయుధ పరీక్షలపై ప్రకటన చేయడం గమనార్హం.

## రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

- మొదటి పేజి తరువాయి

బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది.ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.ఈ ఓటమిపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు.మరోవైపు, ఓటర్లు, ఎంపీల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమతుల్యతను సరిదిద్దడానికే డీలిమిటేషన్ అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదించారు. సవరణ బిల్లు ఓటమితో, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను కూడా ముందుకు తీసుకెళ్లబోమని ప్రభుత్వం ప్రకటించింది.

## మీకు మహిళల ఉసురు తగులుతుంది

- మొదటి పేజి తరువాయి

వ్యక్తం చేశారు.లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు.ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

## ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్‌కు బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. మెట్రో రైలు స్టేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు ఏవీ లభించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. మెట్రో రైలు స్టేషన్‌లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని పోలీసులు వెల్లడించారు. ఫోన్ చేసిన నెంబర్ ఆధారంగా ఆ వ్యక్తి ఎవరో ఆరా తీసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్...

- మొదటి పేజి తరువాయి

ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు.అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి.ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



బాచుపల్లి పెద్దకుంట చెరువు బఫర్ జోన్‌లో, అక్రమ నిర్మాణం ప్రారంభానికి సిద్ధం..

# చెరువులో 'షాపింగ్ మాల్'..! ప్రారంభానికి సిద్ధం..!

- నిజాంపేట్ సర్కిల్-58 నుండి.. మార్చి 12న మొదటి షోకాజ్ నోటీస్..!
- సరిగ్గా నెల రోజుల తర్వాత.. ఏప్రిల్ 13న స్పీకింగ్ ఆర్డర్ జారీ..

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 17:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్-58 పరిధిలోని, బాచుపల్లి పెద్దకుంట లేక్ఐడి నెంబర్ 2821 చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో అక్రమ కమర్షియల్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.. మరోవైపు 'పెన్ పవర్' దినపత్రికలో వరుస కథనాలు, ఎక్స్(ట్విట్టర్)లో, స్థానిక నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళగా, ఆయన స్పందించి సమాధానం ఇచ్చారు.. నిజాంపేట్ సర్కిల్-58 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, బాచుపల్లిలో అనధికారిక నిర్మాణంపై చర్యల్లో భాగంగా.. నోటీస్ నెంబర్. 100/UC/TPS/W.273/C58/CMC/2026 ద్వారా, 12 మార్చి 2026న షోకాజ్ నోటీసు జారీ చేశామని, అనంతరం 13 ఏప్రిల్ 2026న స్పీకింగ్ ఆర్డర్స్ జారీచేసినట్టు తెలిపారు. జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు కొనసాగనున్నాయని స్పష్టం చేశారు..

- స్పీకింగ్ ఆర్డర్ జారీ సమయానికే (ఏప్రిల్-13) అక్రమ నిర్మాణం పూర్తి..!
- ఇందులో అధికారుల నోటీసులకు విలువేముంది..?
- హైకోర్టు ఉత్తర్వులతో జీహెచ్‌ఎంసి కమిషనర్ సర్క్యులర్ బేఖాతర్..
- నిజాంపేట్ సర్కిల్-58 'నోటీసుల ప్రక్రియ' ముగియక ముందే నిర్మాణం పూర్తి..
- మూడు శాఖల అధికారుల సమిష్టి భద్రతలో బాచుపల్లి పెద్దకుంట చెరువు..
- షోకాజ్ నోటీసు జారీచేసిన వెంటనే, పనులు నిలిపివేయాల్సిన యంత్రాంగం..
- అధికారుల నిర్లక్ష్యం.. పనులు వేగవంతం.. రాయల్ ఓక్ పేరుతో ఓపెనింగ్‌కి సిద్ధం..
- జీహెచ్‌ఎంసి కమిషనర్ "2025 మే 2న" జారీచేసిన సర్క్యులర్ బేఖాతర్..?





బాచుపల్లి లేక్ఐడి నెంబర్.2821 చెరువులో, ఎనిమిదేళ్ళ క్రితం గ్రామపంచాయతీ అనుమతుల పేరిట, అక్రమ సెల్లార్‌తో, జీ౦2 నిర్మాణం, తాజాగా ఎలాంటి పర్మిషన్ లేకుండా.. పాత నిర్మాణంపై కొత్త కట్టడంతో, కమర్షియల్ కాంప్లెక్స్‌గా మార్చాడంలో అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.. మార్చి 12న షోకాజ్ నోటీసులు జారీచేసిన, నిజాంపేట్ సర్కిల్-58 'సిఎంసి' టౌన్‌ప్లానింగ్ అధికారులు.. పనులు కొనసాగకుండా పర్యవేక్షణ మరిచారు.. నెల రోజుల తర్వాత, ఫైనల్‌గా స్పీకింగ్ ఆర్డర్ జారీచేసిన(ఏప్రిల్ 13) సమయానికి, అక్రమ నిర్మాణం తుదిదశకు చేరుకోవడం గమనార్హం.. అక్రమ నిర్మాణ దారుల ఆపేక్ష, అధికారుల నిర్లక్ష్యంతో హైకోర్టు ఉత్తర్వులు, జీహెచ్‌ఎంసి కమిషనర్ సర్క్యులర్‌ను బేఖాతర్ చేశారు.




## నిబంధనలు అతిక్రమించి నిర్మాణ పనులు..

అనధికారిక అక్రమ నిర్మాణాలకు అధికారులు తీసుకునే చర్యల్లో భాగంగా, మొదటి షోకాజ్ నోటీసు జారిచేసిన వెంటనే, పనులు నిలిపివేసి, విచారణ చేపట్టాలని, నోటీసుల ప్రక్రియ ముగిసి, అక్రమమా, సక్రమమా తేల్చేవరకు ఎలాంటి పనులు చేపట్టకూడదు.. అనుమతుల నిబంధనలను అతిక్రమించిన అక్రమ కట్టడాలపై, రమేష్ అనే ఫిర్యాదు దారుని కేసులో, తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది.. గతేడాది '2025 మే 2న' జీహెచ్‌ఎంసి కమిషనర్‌కు ఉత్తర్వులు జారీచేసింది.. ఈ నేపథ్యంలో అదేరోజు జీహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హుటాహుటిన జీహెచ్‌ఎంసి పరిధిలోని సర్కిల్‌లకు 'సర్క్యులర్' విడుదల చేశారు.. మొత్తం టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఈ ఆదేశాలు పాటించాలని కమిషనర్ ఆదేశించారు..



బాచుపల్లి పెద్దకుంట చెరువు, కెడస్టల్ మ్యాప్..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఏసిపి సార్.. ఈషెడ్లకు అనుమతులేవి..?

### అక్రమ షెడ్లే.. అధికారులకు బంగారు బాతుగుడ్లు..?

- సర్కిల్ వ్యాప్తంగా 'చట్టాలను అతిక్రమించి' నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలే..!
- అనుమతులు తీసుకోకుండా అనేక అక్రమ నిర్మాణాలు..
- దొమ్మర పోచంపల్లిలో కొత్తగా మరో మూడు అక్రమ షెడ్లు..?

- దుండిగల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి..
- ఇప్పటికే పోలీస్ స్టేషన్ వెనుకవైపు కన్జర్వేషన్ జోన్‌లో భారీ షెడ్డు నిర్మాణం..
- కొత్తగా మరో రెండు షెడ్లు, రింగ్ రోడ్ సమీపంలో ఒకటి, సారెగూడేంలో ఒకటి.
- ఈ షెడ్లకు అనుమతులు.. ఏమున్నాయో టౌన్‌ప్లానింగ్ 'ఏసిపి' తేల్చాలి..

-4లో




## రూ.2 లక్షల లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎక్సైజ్ సీఐ

- కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎక్సైజ్ సీఐ
- రూ.2 లక్షలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ
- కల్లు దుకాణం తరలింపునకు లంచం డిమాండ్ చేసిన సీఐ సత్యనారాయణ
- సీఐని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచిన అధికారులు

హైదరాబాద్ పెన్ పవర్:కామారెడ్డి జిల్లాలో ఓ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బిచ్కుంద ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్న దీను సత్యనారాయణ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు .వివరాల్లోకి వెళితే... ఓ వ్యక్తి తన కల్లు దుకాణాన్ని మరో గ్రామానికి మార్చుకోవడానికి అనుమతి కోరాడు. అదే సమయంలో

-4లో



# ఏసిపి సార్... ఈషెడ్లకు అనుమతులేవి...?




శ్రీనివాస్.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్

## అక్రమ షెడ్లే.. అధికారులకు బంగారు బాతుగుడ్లు..?

- సర్కిల్ వ్యాప్తంగా 'చట్టాలను అతిక్రమించి' నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలే..!
- అనుమతులు తీసుకోకుండా అనేక అక్రమ నిర్మాణాలు..
- దొమ్మర పోచంపల్లిలో కొత్తగా మరో మూడు అక్రమ షెడ్లు..?




రింగ్ రోడ్ సమీపంలో మరో కొత్త షెడ్డు నిర్మాణం..

- దుండిగల్ సర్కిల్‌లో టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఉందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి..
- ఇప్పటికే పోలీస్ స్టేషన్ వెనుకవైపు కన్జర్వేషన్ జోన్‌లో భారీ షెడ్డు నిర్మాణం..
- కొత్తగా మరో రెండు షెడ్లు, రింగ్ రోడ్ సమీపంలో ఒకటి, సారెగూడేంలో ఒకటి.
- ఈ షెడ్లకు అనుమతులు.. ఏమున్నాయో టౌన్‌ప్లానింగ్ 'ఏసిపి' తేల్చాలి..





**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 17:** దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, బహుదూర్‌పల్లి డివిజన్, దొమ్మర పోచంపల్లి గ్రామ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.. ఇప్పటికే టౌన్‌ప్లానింగ్ అధికారుల అండతో, బహుదూర్‌పల్లి చౌరస్తా సమీపంలో, సుమారు 1500 గజాల భారీ అక్రమ షెడ్డును, టౌన్‌ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే నిర్మాణం విజయవంతంగా పూర్తిచేసిన విషయం తెలిసిందే..!కొత్తగా మరో మూడు అక్రమ షెడ్లు నిర్మితమవుతున్నాయని దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. ఓవైపు అక్రమ కట్టడాలపై హైకోర్టు ఆదేశాలతో, జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ జారీచేసిన "సర్క్యులర్"ను కూడా, దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు బేఖాతర్ చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.. ఇప్పటికే చర్యల పేరుతో, టౌన్‌ప్లానింగ్ కరప్షన్ కోసమే అధికారుల విధులు, అన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.. మరోవైపు వసూళ్ళలో ఆరితేరిన ఓ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, టౌన్‌ప్లానింగ్ అధికారి పక్కనే పెట్టుకొని, ఈ దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. సర్కిల్ వ్యాప్తంగా ఎక్కడ చూసినా, వందలాది, ప్రమాదకర అక్రమ నిర్మాణాలు, వెలుస్తున్నాయని..! పత్రికల్లో వరుస కథనాలు వచ్చినా, దున్నపోతు మీద వర్షం పడిన చందంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.. దీనికి తోడు భారీ అక్రమ షెడ్ల నిర్మాణాలు.. టౌన్‌ప్లానింగ్ అధికారులకు, చైన్‌మెన్‌లకు, బంగారు బాతుగుడ్లుగా తయారయ్యాయి అంటూ పలువురు విమర్శిస్తున్నారు..

## దొమ్మర పోచంపల్లిలో అక్రమ షెడ్లు..

దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధిలో ఉన్న వాటిపైనే చర్యలు తీసుకునే దిక్కులేకపోగా.. రోజుకో పది అక్రమ నిర్మాణాలు, అనుమతుల్లేని అక్రమ షెడ్ల నిర్మాణం అధికారులకు, కల్పతరువుగా మారాయి.. ఈ అక్రమ కట్టడాల దందాపై నిత్యం వార్తలు వస్తున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. దొమ్మర పోచంపల్లి పరిధిలోని కన్జర్వేషన్ జోన్ స్థలంలో ఓ భారీ షెడ్డు నిర్మిస్తుండగా..! దుండిగల్ పోలీస్ స్టేషన్ వెనుకవైపు ఒకటి సారెగూడెం వసుధన్ ఆసుపత్రి సమీపంలో మరొకటి, ఈ మూడు అక్రమ షెడ్లు, దర్జాగా నిర్మిస్తుండటంపై అధికారులకు-చైన్‌మెన్‌లకు తెలియకుండా సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. గత వారం రోజులుగా "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథానలను ప్రచురించి, దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, వెంకటేశ్వర నాయక్, టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసిపి శ్రీనివాస్, టిపిఎస్ ముఖేష్ సింగ్, స్థానిక చైన్‌మెన్‌ల దృష్టికి తీసుకెళ్ళినా.. అక్రమ కట్టడాల పర్వం యథావిధిగా కొనసాగటం అనుమానాలకు తావిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి..




గండిమైసమ్మ పోలీస్ స్టేషన్ వెనుకవైపు అక్రమ కొత్తగా షెడ్డు..




దొమ్మర పోచంపల్లి గ్రామ పరిధిలోని కన్జర్వేషన్ జోన్‌లో అక్రమ షెడ్డు నిర్మాణం..

# రూ.2 లక్షల లంచం.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఎక్సైజ్ సీఐ

- 3 పేజి తరువాయి

తనపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశాడు. ఈ పని చేసిపెట్టడానికి సీఐ సత్యనారాయణ బాధితుడి నుంచి లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు.

ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. బిచ్కుందలోని సీఐ అద్దె ఇంట్లో బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీఐ వద్ద అదనంగా లభించిన రూ.45,670 నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి, హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

# తెలంగాణ ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

**హైదరాబాద్, ఏప్రిల్ 17, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మరోసారి సమ్మె సైరన్ మోగుతుంది. తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ ఏప్రిల్ 22 అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. గత కొన్ని వారాలుగా ప్రభుత్వంతో, యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలించకపోవడంతో, కార్మికులు, ఈ నిర్ణయం తీసుకున్నారు. వేసవి సెలవు ప్రారంభంకానున్నాయి. ఈ తరుణంలో సెమ్మె ప్రకటన సామాన్య ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది. టీజీఎస్ ఆర్టీసీని పూర్తి స్థాయిలో ప్రభుత్వ విభాగంగా విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల ఉద్యోగులకు ఆర్థిక స్థిరత్వం, ఉద్యోగ భద్రత లభిస్తుందని యూనియన్లు చెబుతున్నాయి. 2021 ,2025 వేతన సవరణలను తగిన ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని మరో డిమాండ్ ఉంది. కార్మికులు 30 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతన సవరణ కోరుతున్నారు. రాష్ట్రప్రభుత్వం అమల చేస్తున్న మహాలక్ష్మి వల్ల సంస్థకు వస్తున్న ఆదాయ లోటును భర్తీ చేసేందుకు ప్రతి నెల 350 కోట్లను
ఎటువంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. దీని వల్ల సంస్థ ఉనికి దెబ్బతింటుందని, ప్రభుత్వమే నేరుగా ఈ బస్‌లను నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఆర్టీసీలో గుర్తింపు పొందిన కార్మిక సంఘాల కోసం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ డిమాండ్ చేస్తోంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ అంశంపై స్పందించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిగా విలీనం చేయాలనే ప్రతిపాదన ఒక కమిటీ పరిశీలనలో ఉందన్నారు. కార్మికుల సమ్మెకు వెళ్లవద్దని సూచించారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 2.1శాతం కరవు భత్యం పెంచినట్టు గుర్తు చేశారు. 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న 10 డీఏలను విడతల వారీగా విడుదల చేశామన్నారు. 2017 పీఆర్‌సీని కూడా 21 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేశామని వివరించారు. ఆర్టీసీ చరిత్రలో 2019 అక్టోబర్‌లో జరిగిన 52 రోజుల సుదీర్ఘ సమ్మెను

ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. అప్పటి ప్రభుత్వం సమ్మెను చట్టవిరుద్ధంగా ప్రకటించింది. విధులకు హాజుకాని వారిని డిస్మిస్ చేస్తామని హెచ్చరించింది.
ఆనాడు సుమారు 50 మందికిపైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. సమ్మె జరిగితే రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడతారు. అప్పట్లో అదే జరిగిందని ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంది. ఇప్పుడు కూడా నిత్యం బస్‌లపై ఆధారపడే ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రజలకు సవాళ్లు తప్పవు. అందుకే ఉద్యోగులు సమ్మె వెళ్లకుండా నిరోధించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సత్తుపల్లి రింగ్ సెంటర్లో ఎల్ఈడీ డిస్ ప్లే స్క్రీన్ ఏర్పాటు

**సత్తుపల్లి, ఏప్రిల్ 17 పెన్ పవర్,** సత్తుపల్లి రింగ్ సెంటర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ డిస్ ప్లే స్క్రీన్ ను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ రాత్రి పరిశీలించారు. స్క్రీన్ పై ప్రదర్శితమవుతున్న ప్రకటనలను ఆమె వీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెహానా కమలపాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలతతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



**సత్తుపల్లి, ఏప్రిల్ 17 పెన్ పవర్,** రాత్రి మణుగూరు సిఎస్పి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వితల్రావు నగర్కు చెందిన రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇంటి ముందు క్షుద్ర పూజల కలకలం

**వర్ధన్నపేట, ఏప్రిల్ 17 పెన్ పవర్,** పర్వతగిరి మండల కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అల్లూరి కాలనీకి చెందిన రవీందర్ అనే వ్యక్తి ఇంటి ఎదుట నిమ్మకాయలు, కొబ్బరికాయలు, పూజా సామగ్రితో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు లభించాయి. రవీందర్ కుటుంబంతో సహా హైదరాబాదులో నివసిస్తున్నాడు. ఈ సంఘటనతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

## "మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం"

**పరకాల, ఏప్రిల్ 17 పెన్ పవర్,** హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని పత్తిపాక గ్రామ ప్రజలు, ప్రకృతి సంపదను కొల్లగొడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్న స్టోన్ క్రషర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యుల నేతృత్వంలో "మన పత్తిపాక గుట్టలను కాపాడుకుందాం" అనే నినాదంతో ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్ వల్ల ఇప్పటికే ఒక గుట్ట పూర్తిగా కనుమరుగైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

## గంజాయి మత్తులో హమాలి పై దాడి

**నర్సంపేట, ఏప్రిల్ 17 పెన్ పవర్,** వరంగల్ నగరంలోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో గంజాయి మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు ఒక హమాలిపై దాడి చేశారు. మార్కెట్లో పనిచేస్తున్న సూరయ్య బహిర్భూమికి వెళుతుండగా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీస్ సమీపంలో నలుగురు వ్యక్తులు ఒకరిని కొడుతుండడాన్ని గమనించి, వారిని ఆపేందుకు వెళ్లారు. దీంతో, దాడి చేస్తున్న వ్యక్తులు సూరయ్యను కూడా కొట్టారు. అక్కడే ఉన్న రైతులు సూరయ్యను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.


## కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 17 పెన్ పవర్,** సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో నేషనల్ హైవే 365ః పై వీరన్నపేట స్టేజి వద్ద అతివేగంగా రాంగ్ రూట్లో వచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో తొడెంగుల నర్సింహులు అనే వ్యక్తి శుక్రవారం అక్కడికక్కడే మృతి చెందారు. నర్సింహులు తన ఆకుకూరల వ్యాపార నిమిత్తం జనగామ జిల్లాలోని వీఎస్ఆర్ నగర్, కట్కూర్ ప్రాంతాలకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. జనగామ నుండి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు (ంఖ15ంఒ2525) అతివేగంతో రాంగ్ రూట్లో వచ్చి, నర్సింహులు నడుపుతున్న టివిఎస్ లూనా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.

## జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం

**వరంగల్ వెస్ట్, ఏప్రిల్ 17 పెన్ పవర్,** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం అలిపురం వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో వడ్ల లోడుతో వెళ్తున్న లారీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లారీ ఇంజిన్ భాగం పూర్తిగా కాలి బూడిదైంది. అప్రమత్తమైన డ్రైవర్ నిడుగొండ నాగరాజు (36) లారీ నుంచి దూకి తన ప్రాణాలను కాపాడుకున్నారు. ఖమ్మం నుండి కామారెడ్డికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## నర్సంపేటలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక సమీక్ష




**ములుగు, ఏప్రిల్ 17 పెన్ పవర్,** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట రైతు వేదికలో ఆర్డీఓ ఉమారాణి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కార్యక్రమాన్ని మరింత విస్తరించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ స్పెషల్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఎంఆర్డీ, ఎంఈఓ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై నిరసనకు భారీ స్పందన


**ఖమ్మం రూరల్ పెన్ పవర్,17.4.2026.** శుక్రవారంనాడు కూసుమంచి మండలంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన నిరసన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర TGEJAC ఇచ్చిన దశలవారీ పోరాట కార్యక్రమంలో భాగంగా, కూసుమంచి మండల TGEJAC ఆధ్వర్యంలో ఈరోజు (17-04-2026, శుక్రవారం) మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా తహసీల్దార్ గారికి పలు ప్రధాన డిమాండ్లతో మెమోరాండం సమర్పించారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. రెండవ పిఆర్సి కమిషన్ రిపోర్ట్‌ను వెంటనే విడుదల చేసి అమలు చేయాలి.
2. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.13,000 కోట్ల బిల్లులను తక్షణమే విడుదల చేసి, పెన్షనర్లకు మరియు ఉద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించాలి.
3. ఉద్యోగులు, పెన్షనర్లందరికీ ఆరోగ్య కార్డులను వెంటనే మంజూరు చేసి, కొత్త జునూ పథకాన్ని మే 1వ తేదీ నుండి అమలు చేయాలి.
4. రాష్ట్రంలో కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ (CPS)ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (OPS)ను పునరుద్ధరించాలి. అలాగే 01-09-2004కు ముందు నోటిఫికేషన్ పొందిన ఉద్యోగులకు OPS అమలు చేయాలి.ఇవి కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 64 ప్రధాన సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో TGE JAC ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# హైడ్రా ...డ్రామా...




**హైదరాబాద్, ఏప్రిల్ 17, పెన్ పవర్:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక సంస్థ హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత కొద్ది రోజులుగా నగరవ్యాప్తంగా అక్రమ నిర్మాణాల తొలగింపులో దూకుడు ప్రదర్శిస్తున్న హైడ్రాకు ఇది బిగ్ షాక్ అని వైరల్ అవుతోంది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కూల్చివేతలు నిలిపివేయాలనే హైకోర్టు స్పష్టం చేసినట్టు ప్రచారం సాగుతోంది. హైడ్రా పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని హైడ్రా ఖండించింది. ఇదంతా తప్పుడు ప్రచారమని కొట్టిపారేసింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ బెంచ్ పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆ నోటీసులు పూర్తిగా నకిలీవని స్పష్టం చేసింది.ఈ ఫేక్ ప్రచారంపై హైడ్రా తీవ్రంగా స్పందించింది. ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాని మండిపడింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుకు అధికారికంగా ఫిర్యాదు కూడా చేశారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, న్యాయస్థానాల గౌరవాన్ని కించపరిచేలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా కోరింది. హైడ్రా కార్యకలాపాలను పరిశీలించిన హైకోర్టు, ఈ సంస్థకు ఇప్పటి వరకు ఒక నిర్దిష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకపోవడాన్ని తప్పుపట్టిందని సర్క్యులేట్ అవుతున్న డాక్యుమెంట్‌లో ఉంది. ఏడాది కాలం గడుస్తున్నా, నిబంధనలు రూపొందిం చకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిందని నోటీసుల్లో పేర్కొన్నట్టు ఉంది. నోటీసులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ
కాదని కూడా కోర్టు అభిప్రాయపడినట్టు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా అమీన్‌పూర్ పరిధిలో జరిగిన కూల్చివేతలకు సంబంధించిన వీడియోను పరిశీలించిన తర్వాత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసిందని కూడా అందులో ఉంది. అయితే ఇవన్నీ కూడా హైడ్రాను దెబ్బతీసేందుకు ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అధికారులు మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సహజ వనరులను కాపాడటానికి హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు తీరుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చివేసేటప్పుడు కనీస గడువు ఇవ్వడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు కొందరి నుంచి వస్తున్న విమర్శలనే కోర్టు ఆదేశాలు అంటూ ప్రచారం చేస్తున్నారు. దీనిపై హైడ్రా ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి దర్యాప్తు స్టార్ట్ చేశారు.

**ఫాతిమా సంస్థల్లో చేరడంపై హైడ్రా కండిషన్స్**

హైదరాబాద్ పాతబస్తీ బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలంగాణ హైకోర్టు కీలక సూచన చేసింది. ఈ విద్యా సంస్థ నిర్మాణాల విషయమై పిటిషన్లు కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో విద్యార్థులు, వారి పేరెంట్స్ తమ సొంత రిస్క్‌పైనే అడ్మిషన్లు తీసుకోవాలని స్పష్టం చేసింది. విద్యాసంస్థకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అప్పుడు ఎలాంటి హక్కులు కోరలేరని స్పష్టం చేసింది. కాబట్టి ఇప్పటికే అక్కడ చదువుతున్న విద్యార్థుల భవితవ్యం కూడా తుది తీర్పుకు లోబడే ఉంటుందని జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ కీలక ఆదేశాలు జారీ చేశారు.సల్కం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఈ విద్యా సంస్థను అక్రమంగా నిర్మించారని దీనిపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని అడ్వకేట్ విజయ్ గోపాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగరంలో 26 చెరువులుండగా.. కేవలం సల్కం చెరువుకు మాత్రమే ఎఫ్‌టీఎల్ ఖరారు చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ స్థాపించిన 'సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను పరిశీలిస్తే.. ఈ సంస్థ చెరువు మధ్యలో, బఫర్ జోన్‌లో నిర్మించినట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.విద్యా సంస్థపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని మేనేజ్‌మెంట్ తమ నోటీసు బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. దాంతో పాటు సల్కం చెరువు పరిధిలో ఇకపై ఎలాంటి అదనపు నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 1 నుండి ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంపై కోర్టు ఇచ్చే తదుపరి ఉత్తర్వులు ప్రభావం చూపుతాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 30కి వాయిదా వేశారు.కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఒవైసీ ఫాతిమా కాలేజీ సల్కం చెరువులో నిర్మించినట్లు ఆధారాలు ఉన్నా.. దానిపై చర్యలు తీసుకోలేదు. ఇదే విషయమై సోషల్ మీడియా తదితర మాధ్యమల్లో హైడ్రాని పలువురు ప్రశ్నించారు. దీంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గతంలోనే క్లారిటీ ఇచ్చారు. సల్కం చెరువు ఎఫ్టీఎల్‌లో
నిర్మించిన ఫాతిమా కాలేజ్ తొలగిస్తామని గత సెప్టెంబర్‌లో ప్రకటించామని చెప్పారు. అయితే పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థ ఇక్కడ నడుస్తోందని అన్నారు. ఈ కాలేజీలో ఎలాంటి ఫీజులు వసూలు చేయరని.. 10 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ అయినందునే సామాజిక కోణంలో ఆలోచించి చర్యలు తీసుకోలేకపోతున్నామని చెప్పారు.

## పిప్రిలో నూతన ఆరోగ్య కేంద్రం ప్రారంభం



**బాల్కొండ, ఏప్రిల్ 17పెన్ పవర్,** నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలం పిప్రి (జె) గ్రామంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన ఆరోగ్య కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ అరిగెల జనార్దన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, బీపీ, షుగర్ వంటి వ్యాధులు నియంత్రణలో ఉంటేనే జీవితం ఆనందంగా సాగుతుందని, ఈసీజీ పరీక్షల ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామ ప్రజలకు ఉచితంగా మాత్రలు పంపిణీతో పాటు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంలో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో హామీలను నెరవేర్చాలి

**నల్లగొండ, ఏప్రిల్ 17పెన్ పవర్,**తెలంగాణ రాష్ట్రంలోని 15.25 లక్షల ఉద్యోగులు, 206 సంఘాల తరపున తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఉద్యోగుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, దశల వారి పోరాటంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించి, కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

# తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ విభజనను ఇండియా--పాకిస్తాన్ విభజనతో పోల్చిన తేజస్వి సూర్య వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, ఉద్యమ స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్ లాల్ అన్నారు తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాలతో రాలేదని. దశాబ్దాల పోరాటం, వేలాది మంది విద్యార్థులు, యువత, ఉద్యోగులు, రైతులు, మహిళలు, మేధావులు, ప్రజాసంఘాల ఉద్యమాలతో సాధించుకున్న హక్కు. తెలంగాణ కోసం 1200 మందికి పైగా అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారని. అలాంటి త్యాగాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడం తెలంగాణ చరిత్రను, ప్రజల మనోభావాలను అవమానించడం సరైన పద్ధతి కాదన్నారు భాష, సంస్కృతి, ఆత్మగౌరవం, ఉద్యోగాలు, నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన తెలంగాణ ఉద్యమాన్ని అర్థం చేసుకోకుండా మాట్లాడటం అత్యంత బాధ్యతారాహిత్యమని. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ దేశానికి వ్యతిరేకంగా పోరాడలేదని తమ హక్కుల కోసం, రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర సాధన కోసం మాత్రమే పోరాడారన్నారుభారత రాజ్యాంగం ప్రకారం, పార్లమెంట్ ఆమోదంతో, ప్రజాస్వామ్య పద్ధతిలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని. అలాంటి చట్టబద్ధమైన ప్రక్రియను దేశ విభజనతో పోల్చడం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమానించినట్టేనని

ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలు చేసే నాయకులు ముందుగా తెలంగాణ చరిత్రను, ఉద్యమాన్ని, అమరవీరుల త్యాగాలను తెలుసుకోవాలి. ప్రజల మనోభావాలతో ఆటలాడే వ్యాఖ్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కావు.

ఈ వ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు, అమరవీరుల కుటుంబాలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఆయన డిమాండ్ చేశారు.

# విద్యా సదస్సును జయప్రదం చేయండి


**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న సుందర విజ్ఞాన కేంద్రం లింగంపల్లి హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన రాష్ట్రస్థాయి విద్యా సదస్సును జయప్రదం చేయాలని టి పి టి ఎఫ్ మండల అధ్యక్ష ,కార్యదర్శులు పి యాదగిరి నాయక్, జి బాలాజీ నాయక్ లు కోరారు గార్ల మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో శుక్రవారం వాల్ పోస్టర్ కరపత్రాలను యూనియన్ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరిగే యుద్ధాలను వ్యతిరేకించి ప్రపంచ శాంతి కోసం ప్రజలందరూ ఐక్యత నినర్దించవలసిన అవసరం ఉందన్నారు. విద్య తాత్వికతను పరిశీలిస్తే జాతీయ విద్యా విధానం 2020 అమలు ఎంత ప్రమాదకరమో తెలుస్తుందని విద్యారంగా నిర్వహణ కేంద్రం తన చేతిలోకి తీసుకొని రాష్ట్రాల ప్రతిపత్తి ప్రజాస్వామిక రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇవ్వడం గర్హనీయం అన్నారు. రాష్ట్ర ప్రజల ఆర్థిక రాజకీయ సాంస్కృతిక అభివృద్ధికి అవసరమైన ప్రజాస్వామ్యక విలువల పునాదిగా ఉండవలసిన విద్యా విధానాలపై, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యా సమాన విద్య సమన్యాయంపై ఆధారపడిన



ఉన్నత ప్రమాణం కలిగిన కామన్ విద్య ఆవశ్యకతను చర్చించడానికి అవలోకనం చేసుకోవడానికి నిర్వహించే రాష్ట్ర విద్యా సదస్సును ఉపాధ్యాయులు విద్యాభిమానులు విద్యార్థులు యువజనలు సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు వెంకట్ రెడ్డి రామనాథం సిహెచ్ నాగరాజు ఆర్ ప్రవీణ్ కుమార్ సతీష్ యాకయ్య రజియా కరుణ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే గేటు మూసివేత రెండు రోజులపాటు రాకపోకలు బంద్





**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** గార్ల నుండి డోర్నకల్ వెళ్లే మార్గంలో ఉన్న గేటును మరమ్మత్తుల కారణంగా రెండు రోజులు మూసి వేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే గేటు వద్ద అత్యవసర నిర్వహణ పనులు చేపడుతున్నందున నేటి నుంచి రెండు రోజుల వరకు రైల్వే గేటు మూసి వేసి వాహనాలు రాకపోకలు నిలిపి వేస్తున్నామన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంతం గుండా ప్రయాణించే ప్రయాణికులు వాహనదారులు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు జరపాలని సూచించారు గార్ల నుంచి డోర్నకల్ వెళ్లేవారు బుద్ధారం మీదుగా తమ ప్రయాణాన్ని కొనసాగించాలన్నారు ప్రయాణికులు ట్రాఫిక్ దారి మళ్లింపును పాటిస్తూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

# నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన




**గార్ల పెన్ పవర్ ఏప్రిల్ 17:** టి జి ఈ జాక్ పిలుపుమేరకు.. విశ్రాంత, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించి, పి ఆర్ సి ని కమిటీ నుంచి తెప్పించుకొని 51 శాతం ఫిట్ మెంట్ తో వెంటనే అమలు చేయాలని, జాక్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గార్ల తాసిల్దార్ శారదకు అందజేశారు. అనంతరం గార్ల, బయ్యారం విశ్రాంత సంఘం ఉద్యోగుల అధ్యక్షులు గుడి రాంప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిపిఎస్) నురద్దుచేసి ఓ పి ఎస్ పాత పెన్షన్స్ స్కీమును ను అమలు చేయాలని అన్నారు , ఉద్యోగుల ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను వెంటనే అమలు చేయాలని, విశ్రాంతి ఉద్యోగులకు రావలసిన బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో మాలోత్ శివ ఉద్యోగ సంఘాల నాయకులు జి బాలాజీ నాయక్ పి యాదగిరి నాయక్, సిహెచ్ రమేష్ సురేందర్ రెడ్డి, మాచర్ల సుందర్ కుమార్ షరీఫ్, బి వీరు నాయక్, శివాజీ నాయక్, జబ్బా వీరస్వామి, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో ముస్లిం మహిళలకు ప్రాధాన్యత, ఉప కోటా కల్పించాలని మైనారిటీ జిల్లా మహిళా సంఘం జిల్లా నాయకురాలు షేక్ శంషాద్ బేగం ఉపసర్పంచ్ మహమ్మద్ జరీనా బేగంలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.గార్ల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో 12 శాతానికి అధికంగా ముస్లింలు ఉన్నారని. వారి పట్ల కేంద్ర ప్రభుత్వం అనుచితంగా వ్యవహరించడం ప్రజా ప్రభుత్వం విధానం కాదన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో ముస్లిం మహిళలు ముందుండి పనిచేస్తుంటే, వారి పట్ల కఠినంగా వ్యవహరించడం, మహిళా బిల్లులో ముస్లిం మహిళలకు ప్రత్యేక స్థానం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముస్లింల పట్ల ఈర్ష్యా భావం లేకుండా, మహిళా బిల్లులో ముస్లిం మహిళలకు సముచిత ప్రాధాన్యత, ఉప కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గార్ల జామా మజీద్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బుడన్, మహమ్మద్ రహీం ఖాన్, ఉపాధ్యక్షులు ఎండి. షబీర్ ఖాన్ పఠాన్ ఇమ్రాన్ ఖాన్, షేక్ అఫ్జల్ బేగ్, షేక్ యాకుబ్ మేస్త్రి, ఎండి. జాన్ ఖాన్, ముషారబ్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్సీ వెంటనే ప్రకటించాలి: ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ

**మిర్యాలగూడ, ఏప్రిల్ 17 పెన్ పవర్,** ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 2024 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని, సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు అమలు కాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. జూన్ 2 నుండి నూతన పీఆర్సీ అమలుతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆరోగ్య కార్డులను సమర్థవంతంగా అందించాలని వారు కోరారు.

# దండి భాస్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఖమ్మం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 17:**




దండి భాస్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్ నాయక్ అన్నారు. దండి భాస్కర్ 10వ వర్ధంతి వేడుకలను స్మారక స్తూపం వద్ద ఘనంగా నిర్వహించారు తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి దండి భాస్కర్ ఉద్యమాలకు ముందుండి పోరాటాలు చేశాడని ప్రజల కోసం శ్రమించిన విప్లవ నాయకులు గొప్ప ఆదర్శమూర్తి ఎందరికో రాజకీయంగా మార్గదర్శి అయిన దండి భాస్కర్ మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు సురేష్ భద్రా చారి తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితులకు భరోసా డయాలసిస్ సెంటర్ మంజూరు



**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చింత రమేష్ డిఎంహెచ్ ఓ డాక్టర్ రవి రాథోడ్ జి జి హెచ్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికష్టాలు తీర్చేలా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి డయాలసిస్ సెంటర్ మంజూరైన సందర్భంగా

శుక్రవారం డి సి హెచ్ ఎస్ డాక్టర్ చింత రమేష్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు నీటివసతి మోటర్ కెపాసిటీ సరిపోతుందా లేదా అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు నీటి వసతిపై మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతి నాయక్ తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూపరిండెంట్ కు సూచించారు. ఈ విషయమై సర్పంచ్ పార్వతి నాయక్ వెంటనే స్పందించి పైప్ లైన్ నిర్మాణం చేపట్టి నీటి వసతిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జరీనా బేగం కాంగ్రెస్ పార్టీ నాయకులు హాథిరాం రహీం సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ గౌడ్, సీనియర్ వైద్యులు డాక్టర్ బాలునాయక్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అన్నపూర్ణ రెడ్డి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ స్వాతి, రాణి, మెర్సీ, ఝాన్సీ రాణి, సీనియర్ అసిస్టెంట్ కిషోర్, జూనియర్ అసిస్టెంట్ ఆర్ మధు, బైరపాక శ్రీనివాస్, నరసయ్య, అశోక్, శానిటేషన్ సూపర్వైజర్ దేవరాజు, నర్సింగ్ ఆఫీసర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్లమూడి దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలు




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 17:** గార్ల మండల పిఎసిఎస్ మాజీ చైర్మన్, విశ్వశాంతి విద్యాలయం కరస్పాండెంట్ వడ్లమూడి దుర్గాప్రసాద్ జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ పసుపులేటి రమేష్ ఆధ్వర్యంలో విశ్వశాంతి విద్యాలయంలో విద్యార్థుల సమక్షంలో జన్మదిన కేకును కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా వెనకబడి ఉన్న ఏజెన్సీ మండలమైన గార్ల మండల కేంద్రంలో విద్యాలయం నెలకొల్పి ఎంతో మంది విద్యార్థులు ఈరోజు ఉన్నత స్థాయిలో ఉండటానికి కారకులయ్యారని, భవిష్యత్తులో మరిన్ని తరాల విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించ డానికే కాకుండా రాజకీయంగా ఇంకా ఉత్తమమైన స్థాయికి ఎదిగి మరెన్నో మంచి పదవులను అలంకరించి ప్రజలకు సేవలందిస్తూ అటూ విద్యార్థుల, ఇటు ప్రజల హృదయాల్లో స్థిరంగా నిలిచి కలకాలం వర్ధిల్లేందుకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ఆ భగవంతుడిని మనసార కోరుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ వేడుకలలో పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసుల హెచ్చరిక!

**ఆదిలాబాద్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** ఆదిలాబాద్‌లో మైనర్ల డ్రైవింగ్ ప్రమాదకరంగా మారింది. సరదాగా మొదలై విషాదంగా ముగిసే ఈ డ్రైవింగ్‌పై పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. 'మీ బిడ్డల చేతికి బైక్ తాళాలు ఇవ్వడం అంటే మృత్యుపాశాన్ని అందించడమే' అని పోలీసులు పేర్కొంటున్నారు. వారం రోజుల్లో 400 మంది మైనర్లు స్టీరింగ్ పట్టి రోడ్లపైకి రావడం ఆందోళన కలిగిస్తోంది. అల్లారుముద్దుగా పెంచుకున్న ప్రాణాలు రోడ్డు ప్రమాదాల్లో బలవ్వకముందే మేల్కోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

**బోథ్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన పిల్లికర్ యోగేష్ (20) ప్రేమ వివాహం చేసుకున్న తర్వాత, భార్య కుటుంబ సభ్యులు ఆమెను తీసుకెళ్లారు. వారం తర్వాత ఆమె నిరాకరించడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. నిజామాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు వెల్లడించారు.

## వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్య!

**నిర్మల్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** కుభీరు మండలం సాంబ్లీలో, సాంవీ గ్రామానికి చెందిన టెకేవార్ పీరాజీ (56) అనే వ్యక్తి మద్యం సేవించి ఇంట్లో గొడవ పడుతున్నారని, కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై సుద్దవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నారని తెలిసింది. ఎస్సై శ్రీనివాస్ గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన బుధవారం ఉదయం జరిగి వెలుగుచూసింది.

## కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

**ఖానాపూర్ ఏప్రిల్ 17 పెన్ పవర్:** జన్నారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బూరగడ్డ పుష్పలత, మెట్పల్లి గంగాజల, గట్టు శ్రీరామ్, గట్టు రాజన్నలపై ఈ దాడి జరిగింది. క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. కుక్కల బెడదతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యను నివారించాలని సర్పంచ్ సురేష్ మండల అధికారులను కోరారు.

## పెరుగుతున్న విద్యుత్తు అంతరాయాలు

**ముథోల్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** ఎండలు మండుతున్నాయి. ఇలాంటి సమయాల్లో ఒక్క నిమిషం విద్యుత్తు అంతరాయం కలిగినా వినియోగదారులు ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. గతేడాది కంటే ఈ ఏడాది ఏప్రిల్ మొదటి పక్షం రోజుల్లో జిల్లాలో వినియోగం భారీగా పెరిగింది. ఆర్టిజన్ల సమ్మె కారణంగా తరచూ అంతరాయాలు కలుగుతున్నాయని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉపకేంద్రాల్లో మొన్నటి వరకు ఆపరేటర్లుగా ఆర్టిజన్లు విధులు నిర్వర్తించగా ప్రస్తుతం జేఎల్ఎం, ఏఎల్ఎం, లైన్‌మెన్లు చేస్తుండటం మరో కారణమని తెలుస్తోంది. వీరికి సంబంధిత పనిలో అనుభవం లేకపోవడం, అవగాహనలోపంతో ఈ దుస్థితి వస్తోందంటూ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## రేపాకలో టీబీ విముక్తి బాభియాన్ ప్రోగ్రామ్

**మానకొండూరు, ఏప్రిల్ 17 పెన్ పవర్:** మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలో, శుక్రవారం ఇల్లంతకుంట వైద్య బృందాల ఆధ్వర్యంలో రేపాక ఉపకేంద్రంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా టీబీ విముక్తి బాభియాన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రేపాక ప్రజలకు ప్రభుత్వ వైద్య బృందం ఎక్స్-రేతో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించింది. రేపాక సర్పంచ్ కాత మల్లేశం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొదని మహేష్, జిల్లా టీబీ సూపర్వైజర్ జైత్య మహిపాల్, ఇల్లంతకుంట డాక్టర్ జీవనజ్యోతి, మమత బృందం పాల్గొన్నారు.

## వరదవెల్లిలో వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్య

**కరీంనగర్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** బోయినపల్లి మండలంలోని వరదవెల్లి గ్రామానికి చెందిన వల్లంపట్ల ఎల్లయ్య (71) శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## వీర్నపల్లిలో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ



**సిరిసిల్ల, ఏప్రిల్ 17 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా, వీర్నపల్లి మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం కరపత్రాన్ని హిందు సమ్మేళన నిర్వహణ కమిటీ అధ్యక్షుడు దేవయ్య, సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న, ఉప సర్పంచ్ నరేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మన్, కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 23న కళ్యాణ సీతారామాంజనేయ ఆలయంలో సాయంత్రం 5 గంటలకు జరగనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దేవరాజు, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 9వ తరగతి విద్యార్థిని రిషిక కృషిశతకం పుస్తకావిష్కరణ



**హుజూరాబాద్, ఏప్రిల్ 17 పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా, సిరిసిల్లలోని లింగన్నపేట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పర్సకుర్మ రిషిక రచించిన కృషిశతకం పుస్తకావిష్కరణ మహోత్సవం శుక్రవారం న పాఠశాల ప్రాంగణంలో జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు కసిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ బొల్గం జగన్ మోహన్ రెడ్డి, సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఛైర్మన్ సుభద్రతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

## మిర్చి పంట క్రయవిక్రయాలు కొనసాగింపు

**ఖమ్మం, ఏప్రిల్ 17 పెన్ పవర్:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సాధారణంగా శని, ఆదివారాలు వారాంతపు సెలవుల కారణంగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిలిపివేస్తారు. అయితే, మిర్చి సీజన్ నేపథ్యంలో ఈనెల 18వ తేదీన శనివారం మార్కెట్లో మిర్చి క్రయ విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి పి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు గమనించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

## మునుగోడులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**మునుగోడు, ఏప్రిల్ 17 పెన్ పవర్:** మునుగోడులోని నల్లగొండ రోడ్డు ఆటో స్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీతో పాటు, మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉద్యోగుల న్యాయ పోరాటానికి విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ విధానంపై దశాబ్దాలుగా నెలకొన్న అనిశ్చితికి తెర దించుతూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తాజా తీర్పు, కేవలం ఒక పరిపాలనా పరమైన ఆదేశం మాత్రమే కాదు, అది సామాజిక న్యాయ విజయం. 2004 సెప్టెంబర్ 1వ తేదీని ప్రాతిపదికగా తీసుకుని, ఆ తేదీకి ముందే నియామక ప్రక్రియ ప్రారంభమై, కేవలం సాంకేతిక కారణాలు మరియు ప్రభుత్వ యంత్రాంగం చేసిన జాప్యం వల్ల ఆలస్యంగా విధుల్లో చేరిన వేలాది మంది ఉద్యోగుల పాలిట ఈ తీర్పు ఒక సంజీవనిలా మారింది. న్యాయస్థానం తన తీర్పు ద్వారా "లెజిటిమేట్ ఎక్స్‌పెక్టేషన్" (న్యాయ బద్ధమైన నిరీక్షణ) అనే మౌలిక న్యాయ సూత్రాన్ని పునరుద్ధరించడమే కాకుండా, వ్యవస్థాగత లోపాలకు సామాన్య ఉద్యోగులు బలి కాకూడదని అత్యంత స్పష్టంగా ప్రకటించింది. ఈ వివాదం యొక్క మూలాలు 2004లో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన పెన్షన్ సంస్కరణల్లో నిక్షిప్తమై ఉన్నాయి. బ్రిటిష్ కాలం నాటి పాత పెన్షన్ విధానం (ాఖూ) స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టిన 'కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్' (అఖూ) ఉద్యోగుల భవిష్యత్తును మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడేలా చేసింది. ఓపీఎస్ కింద ఉద్యోగికి తన చివరి వేతనంలో సగం మొత్తం పెన్షన్‌గా, కరువు భత్యంతో కలిపి లభించి, పదవీ విరమణానంతరం గౌరవ ప్రదమైన జీవనానికి హామీ లభించేది. కానీ సీపీఎస్‌లో అటు ప్రభుత్వం, ఇటు ఉద్యోగి వాటాలను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెట్టడం వల్ల తిరిగి వచ్చే పెన్షన్ మొత్తంపై ఎలాంటి భరోసా లేకుండా పోయింది. ఈ అనిశ్చితి ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది; ముఖ్యంగా 2004 సెప్టెంబర్ 1 కటాఫ్ తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు వెలువడి, నియామక ఉత్తర్వులు ఆలస్యమైన అభ్యర్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

?ప్రస్తుత కేసులో న్యాయశాఖకు చెందిన 65 మంది ఉద్యోగులు చేసిన నిరంతర పోరాటం యావత్ రాష్ట్ర ఉద్యోగ లోకానికి దిక్సూచిగా నిలిచింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు సీబీఐ కోర్టుల్లో పనిచేస్తున్న వీరంతా 2004 సెప్టెంబర్ లోపు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైనప్పటికీ, పరిపాలనాపరమైన జాప్యం వల్ల సీపీఎస్ పరిధిలోకి నెట్టబడ్డారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సామ్‌కోషి, జస్టిస్ నందికొండ నర్సింగ్ రావులతో కూడిన ధర్మాసనం "ప్రభుత్వ యంత్రాంగం చేసిన ఆలస్యం వల్ల ఉద్యోగుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధం" అని తేల్చి చెప్పింది. ఒక అభ్యర్థి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న సమయానికి అమల్లో ఉన్న సేవా నిబంధనలే అతనికి వర్తిస్తాయని, నిబంధనలు మార్చి వెనుకటి తేదీ నుండి అమలు చేయడం న్యాయసమ్మతం కాదని ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు ప్రభావం కేవలం ఆ 65 మందికే పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు, విద్యాశాఖ మరియు ఇతర ప్రభుత్వ విభాగాల్లోని సుమారు 13,000 మంది ఉద్యోగులకు ఊరట నివ్వనుంది. గణాంకపరంగా చూస్తే ఇది ప్రభుత్వంపై దీర్ఘకాలిక పెన్షన్ భారాన్ని పెంచవచ్చు కానీ, ఉద్యోగి తన జీవిత కాలమంతా సేవ చేసినందుకు ప్రతిఫలంగా వృద్ధాప్య భరోసా కల్పించడం సంక్షేమ రాజ్య ప్రాథమిక బాధ్యత అని సామాజిక వేత్తలు బలంగా వాదిస్తున్నారు.

?కేంద్ర ప్రభుత్వం సైతం 2023 మార్చిలో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. 2003 డిసెంబర్ 22కు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా ఎంపికైన ఉద్యోగులకు ఒకేసారి అవకాశం (ానివ-బితిఎవ నీజూబితినీని) ఇస్తూ పాత పెన్షన్ విధానంలోకి మారేందుకు అనుమతించింది. భారత ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 57/04/2019 మరియు మెమో నంబర్ 57/05/2021లు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు తీర్పు కూడా కేంద్ర విధానాలకు అనుగుణంగా ఉండటం గమనార్హం. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే రాజకీయ నిర్ణయాల ద్వారా ఓపీఎస్‌ను పునరుద్ధరించగా, తెలుగు రాష్ట్రాల్లో ఈ న్యాయ పోరాటం ఒక కీలక మలుపుగా మారింది. న్యాయస్థానం ఈ తీర్పు అమలుపై కఠిన వైఖరిని అవలంబిస్తూ, జూన్ 10వ తేదీలోగా అమలు చేయాలని, లేనిపక్షంలో న్యాయశాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి స్వయంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించడం అధికారుల అలసత్వానికి చరమగీతం పాడేలా ఉంది. ఆర్థిక కోణంలో చూస్తే, సీపీఎస్ వల్ల ప్రభుత్వం తక్షణమే 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంటుంది, కానీ ఓపీఎస్‌లో రిటైర్మెంట్ వరకు ప్రత్యక్ష భారం ఉండదు. ఆర్టికల్ 14 ప్రకారం సమానత్వపు హక్కును కాపాడిన ఈ తీర్పు, ప్రభుత్వ జాప్యం వల్ల ఉద్యోగుల మధ్య వివక్ష చూపకూడదని నిరూపించింది.

?ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మెమోలను సానుకూలంగా పరిగణించి, మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన దాదాపు 9,000 మంది ఉపాధ్యాయులు దశాబ్ద కాలంగా సీపీఎస్ విష వలయంలో చిక్కుకుని సామాజిక భద్రతకు దూరమయ్యారు. ప్రభుత్వం తన మేనిఫెస్టో హామీలను నిలబెట్టుకుంటూ, హైకోర్టు తీర్పును గౌరవిస్తూ వీరిని తక్షణమే పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని ఉపాధ్యాయ సంఘాలు గళమెత్తుతున్నాయి. ఈ తీర్పు ఉద్యోగులలో వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచడమే కాకుండా, పరిపాలనలో పారదర్శకత మరియు సమయపాలన యొక్క ఆవశ్యకతను గుర్తు చేసింది. న్యాయస్థానం చూపిన చొరవ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ యొక్క ప్రాముఖ్యతను చాటిచెప్పింది. ప్రభుత్వం పంతాలకు పోకుండా, ఆర్థిక పరిమితులను సాకులుగా చూపకుండా, గడువులోగా ఈ తీర్పును అమలు చేసి వేలాది కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. అప్పుడే పరిపాలనలో మానవీయత, న్యాయబద్ధత ప్రతిబింబిస్తాయి. రాబోయే రోజుల్లో ఈ తీర్పు అన్ని శాఖల ఉద్యోగులకు వర్తింప జేయడం ద్వారా ప్రభుత్వం ఒక ఆదర్శవంతమైన మరియు చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవాలని ఆశిద్దాం.

# ఒక మహోన్నత శాస్త్రవేత్త ప్రస్థానం

**హైదరాబాద్ పెన్ పవర్:** విశ్వాంతరాళపు గుట్టుమట్లను విప్పిచెప్పిన విజ్ఞాన శిఖరం, ఆధునిక భౌతిక శాస్త్ర గమనాన్ని మలుపు తిప్పిన యుగ పురుషుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. 1879 మార్చి 14న జర్మనీలోని ఉల్మ్ నగరంలో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఐన్‌స్టీన్, తన అసాధారణ మేధోశక్తితో ప్రపంచ గమనాన్నే మార్చి వేస్తారని ఆనాడు ఎవరూ ఊహించ లేదు. చిన్నతనంలో పాఠశాల విద్యావిధానంపై ఆయనకు ఉన్న తీవ్ర అసంతృప్తి, సంప్రదాయ పద్ధతుల పట్ల ఆయన చూపిన వైముఖ్యత ఆయనను మందమతిగా చిత్రీకరించేలా చేశాయి. కానీ వాస్తవానికి ఆయన లోపల ఒక అగ్నిపర్వతం లాంటి జిజ్ఞాస దాగి ఉంది. కేవలం పుస్తకాల్లోని సమాచారాన్ని వల్లె వేయడం కంటే, ప్రకృతి రహస్యాలను స్వయంగా శోధించడం, ప్రతి చిన్న విషయాన్ని సందేహించి ప్రశ్నించడం ఆయన సహజ నైజం. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ పాలిటెక్నిక్‌లో విద్యనభ్యసించిన కాలంలోనే భౌతిక శాస్త్రంలోని మౌలిక అంశాలపై ఆయనకు అనేక మౌలిక సందేహాలు కలిగేవి. పట్టభద్రుడైన తర్వాత సరైన ఉపాధి దొరకక, స్విస్ పేటెంట్ కార్యాలయంలో ఒక సాధారణ క్లర్కుగా చేరడం ఆయన జీవితంలో ఒక కీలక మలుపు. ఆ సాధారణ ఉద్యోగంలో దరఖాస్తులను పరిశీలిస్తూ దొరికిన ఖాళీ సమయమే ప్రపంచాన్ని మార్చే అద్భుత సిద్ధాంతాలకు గర్భాలయం అయింది. అక్కడ ఆయన చేసిన మేధోమథనం భౌతిక శాస్త్ర పునాదులను పునర్నిర్మించింది. ?1905వ సంవత్సరాన్ని భౌతిక శాస్త్ర చరిత్రలో 'అద్భుత సంవత్సరంగా' అభివర్ణిస్తారు. ఆ ఒక్క ఏడాదిలోనే ఐన్‌స్టీన్ ప్రచురించిన నాలుగు పరిశోధనా పత్రాలు విజ్ఞాన శాస్త్ర ప్రాతిపదికలను కదిలించాయి. మొదటగా, కాంతి అనేది కేవలం తరంగం మాత్రమే కాదని, అది ఫోటాన్లు అనే కణాల రూపంలో ప్రయాణిస్తుందని నిరూపించిన 'ఫోటోఎలక్ట్రిక్ ప్రభావం' క్వాంటం భౌతిక శాస్త్రానికి పునాది వేసింది. రెండవది, పరమాణువుల ఉనికిని గణితాత్మకంగా ధృవీకరించిన 'బ్రౌనియన్ చలనం' రసాయన శాస్త్రంలో విప్లవాన్ని తెచ్చింది. మూడవది, కాలం మరియు స్థలం అనేవి విశ్వవ్యాప్తంగా అందరికీ ఒకేలా ఉండవని, అవి వీక్షకుడి చలనంపై ఆధారపడి ఉంటాయని చాటిన 'ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం' అంతరిక్ష పరిశోధనల దిశను మార్చివేసింది.

ఈ పరిశోధనల ఫలితంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ సమీకరణమైన ఇ=ఎఞగీ2 ఉద్భవించింది. ద్రవ్యరాశి మరియు శక్తి ఒకదానికొకటి పరస్పర మార్పిడి చెందగలవని, అత్యల్ప పదార్థం నుంచి కూడా అపారమైన శక్తిని జనింప జేయవచ్చని ఈ సూత్రం నిరూపించింది. ఇది అటు అణుశక్తి వినియోగానికి దారితీయగా, ఇటు నక్షత్రాల లోపల నిరంతరం మండే శక్తి వెనుక ఉన్న రహస్యాన్ని విప్పింది. ఈ అద్భుత ఆవిష్కరణలే ఆయనకు 1921లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని తెచ్చి పెట్టాయి. ఐన్‌స్టీన్ మేధస్సు ఇక్కడితో ఆగిపోలేదు. 1915లో ఆయన ప్రతిపాదించిన 'సాధారణ సాపేక్ష సిద్ధాంతం' గురుత్వాకర్షణ పట్ల మానవాళికి ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. అంతకుముందు న్యూటన్ చెప్పినట్లుగా గురుత్వాకర్షణ అనేది కేవలం రెండు వస్తువుల మధ్య ఉండే ఆకర్షణ శక్తి మాత్రమే కాదని, అది 'స్థలకాల వక్రత' (అబీతీలజీబిబీతీవ నీట ాజూజీఞవబితిఎవ) అని ఆయన వివరించారు. అంతరిక్షం అనేది ఒక రబ్బరు దుప్పటి లాంటిదని, భారీ గ్రహాలు మరియు నక్షత్రాలు ఆ దుప్పటిపై ఉంచినప్పుడు ఏర్పడే వంపు వల్లనే ఇతర వస్తువులు వాటి వైపు ఆకర్షించబడతాయని ఆయన నిరూపించారు. 1919లో జరిగిన సూర్యగ్రహణ పరిశీలనల్లో, సూర్యుడి ద్రవ్యరాశి వల్ల కాంతి కిరణాలు వంగి ప్రయాణించడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించడంతో ఐన్‌స్టీన్ సిద్ధాంతం అక్షర సత్యమని తేలింది. దీనితో ఐన్‌స్టీన్ ఒక్కసారిగా అంతర్జాతీయ కీర్తిని పొందారు.

ఆయన శాస్త్రీయ విజయాల పక్కన పెడితే, ఐన్‌స్టీన్ ఒక గొప్ప మానవతావాది. జర్మనీలో నాజీల అరాచకాలు పెచ్చుమీరడంతో యూదుడైన ఐన్‌స్టీన్ అమెరికాకు వలస వెళ్లి ప్రిన్స్టన్ యూనివర్సిటీలో తన పరిశోధనలను కొనసాగించారు. యుద్ధాల వల్ల కలిగే వినాశనాన్ని చూసి ఆయన తీవ్రంగా కలత చెందారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణుబాంబు తయారీకి దారితీసిన పరిస్థితుల్లో ఆయన సంతకం చేసిన లేఖ పాత్ర ఉన్నప్పటికీ, ఆ తర్వాత జరిగిన జపాన్ నగరాల వినాశనం ఆయనను శాంతి వైపు నడిపించింది. అణుశక్తిని కేవలం మానవ కళ్యాణం కోసమే వాడాలని ఆయన జీవితాంతం ఉద్యమించారు. ఐన్‌స్టీన్ ప్రభావం కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాలేదు; నేడు మనం అనుభవిస్తున్న ఆధునిక సాంకేతికతలో ఆయన ముద్ర ప్రతిచోటా కనిపిస్తుంది. నేటి జిపిఎస్ (ఉఖూ) వ్యవస్థలు ఆయన సాపేక్ష సిద్ధాంతం ఆధారంగానే ఖచ్చితమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. సెల్ ఫోన్లు, లేజర్లు, సౌరశక్తి ప్యానెళ్లు, టెలివిజన్ కెమెరాలు వంటి అనేక పరికరాలు ఆయన ఫోటోఎలక్ట్రిక్ ప్రభావంపైనే ఆధారపడి పని చేస్తున్నాయి. తన జీవిత కాలంలో 300కు పైగా శాస్త్రీయ పత్రాలను, 150కి పైగా ఇతర తాత్విక రచనలను అందించిన ఐన్‌స్టీన్, "జ్ఞానం కంటే ఊహాశక్తి చాలా గొప్పది" అని నమ్మేవారు. 1955 ఏప్రిల్ 18న ఆయన మరణించినప్పటికీ, ఆయన ప్రతిపాదించిన కృష్ణ బిలాలు (ఃశ్రీజీఞఎ ఊనీశ్రీవబ), గ్రావిటేషనల్ వేవ్స్ వంటి అంశాలు నేటికీ ఖగోళ శాస్త్రవేత్తలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఆయన జీవితం మనకు ఇచ్చే గొప్ప సందేశం ఏమిటంటే?ప్రశ్నించడం ఆపకూడదు, సృజనాత్మకతకు సంకెళ్లు వేయకూడదు, విజ్ఞానం ద్వారా మానవతకు సేవ చేయాలి. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక వ్యక్తి కాదు, ఒక విజ్ఞాన శకం. ఆయన వారసత్వం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది. విజ్ఞాన శాస్త్రాన్ని తాత్వికతతో, మానవత్వంతో జోడించి చూసిన ఆ మహనీయుడు విశ్వం ఉన్నంత కాలం తన అజరామరమైన ఆలోచనల రూపంలో సజీవంగానే ఉంటారు. విజ్ఞాన రంగంలో ఆయన చేసిన కృషిని ఒక వ్యాసంలో బంధించడం సాధ్యం కానప్పటికీ, ఆయన చూపిన బాటలో నడవడం మాత్రం మానవాళికి గర్వకారణం. ఐన్‌స్టీన్ అంటే కేవలం సూత్రాల సమాహారం కాదు, అంతులేని అన్వేషణకు ఆద్యుడు. ఆయన మేధస్సు, వినయం మరియు ప్రపంచ శాంతి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఆయనను ఒక సాధారణ శాస్త్రవేత్త స్థాయి నుంచి యుగప్రవక్త స్థాయికి తీసుకెళ్లాయి. నేటి ఆధునిక ప్రపంచం ఎంత పురోగమించినా, దాని మూలాలు ఎక్కడో ఒక చోట ఐన్‌స్టీన్ మేధో సంపత్తితో అనుసంధానమై ఉంటాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

# కొత్త ఈసీగా అనిల్ చంద్ర పునేఠా ?

**విజయవాడ, ఏప్రిల్ 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ పోస్ట్‌కు పునేఠా పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. పునేఠా నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే గవర్నర్ ద్వారా నియామక ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు సమాచారం. పునేఠా 2019 ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. అయితే 2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఫిర్యాదుతో కేంద్ర ఎన్నికల సంఘం ఆయన్ను సీఎస్ పోస్టు నుంచి తప్పించగా.. ఆ తర్వాత ఆయన రిటైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను విజిలెన్స్ కమిషనర్‌గా నియమించారు. తాజాగా ఎన్నికల కమిషనర్‌గా పునేఠా సేవల్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నీలం సాహ్ని పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగిసిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో పునేఠాకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. పునేఠా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా బాధ్యతలు అప్పగిస్తే.. విజిలెన్స్ కమిషనర్‌గా మరో రిటైర్డ్ ఐఏఎస్, మాజీ సీఎస్ నీరభ్ కుమార్‌ను నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.అనిల్ చంద్ర పునేఠా సొంత రాష్ట్ర ఉత్తరాఖండ్. ఎకనమిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఆయన.. రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చదివారు. ఎల్ఎల్‌బీ కూడా పూర్తి చేశారు. 1984 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన పునేఠా.. కడప జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ద్వారా ఐఏఎస్ అధికారిగా తన కెరీర్‌ను ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఆయన వరుసగా మూడుసార్లు ఉత్తమ కలెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, భూపరిపాలన ప్రధాన కమిషనర్ గా, ఉ

ఉద్యాన, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ ఆయన పనిచేశారు2018 సెప్టెంబర్‌లో నాటి టీడీపీ ప్రభుత్వం అనిల్ చంద్ర పునేఠాకు సీఎస్‌గా బాధ్యతల్ని అప్పగించింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఇంటెలిజెన్స్ డీజీ బదిలీ విషయంలో ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం చేశారనే కారణంతో.. చీఫ్ సెక్రటరీ పదవి నుంచి ఆయన్ను తప్పించింది. ఎల్వీ సుబ్రహ్మణ్యంను నూతన సీఎస్‌గా నియమించింది. ఆ తర్వాత పునేఠా ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గానూ ఆయన పని చేశారు.

# పిఠాపురానికి మహర్దశ




**కాకినాడ ఏప్రిల్ 17, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం పిఠాపురం నియోజకవర్గానికి తీపికబురు చెప్పింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పిఠాపురం మున్సిపాలిటీ హోదా సెలక్షన్ గ్రేడ్‌కు పెరిగింది.. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పిఠాపురం మున్సిపాలిటీకి సంబంధించి హోదా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు పంపారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను పరిశీలించి సెలక్షన్ గ్రేడ్‌కు హోదా పెంచేందుకు ఆమోదం తెలిపారు. పిఠాపురానికి సెలక్షన్ గ్రేడ్ హోదా రావడంతో అదనపు నిధులు వచ్చే అవకాశం ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి ఏపీ ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పిఠాపురం మున్సిపాలిటీ ని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పిఠాపురం మున్సిపాలిటీ కౌన్సిల్, స్పెషల్ ఆఫీసర్ చేసిన ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపించారు. పిఠాపురం మున్సిపాలిటీకి 2021 నుంచి 2025 వరకు వచ్చిన ఆదాయం, వ్యయం వివరాలను పరిశీలించారు. అనంతరం సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలియజేయడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి.పిఠాపురానికి 1957లో మున్సిపాలిటీ హోదా వచ్చింది.. అయితే జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం 30 వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 55వేలమంది వరకు ఉండగా.. ఆ తర్వాత జనాభా సంఖ్య భారీగా పెరిగింది. అలాగే పిఠాపురం ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉంది.. ఇక్కడ పాదగయ క్షేత్రం, కుక్కుటేశ్వరస్వామి, పదోశక్తి పీఠం పురుహూతిక అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, స్వయంభూ శ్రీపాద వల్లభుడి ఆలయం, కుంతీమాధవస్వామి ఆలయాలు ఉన్నాయి. పిఠాపురంలోని ఆలయాలకు భక్తులు భారీగా తరలివస్తుంటారు.. దీంతో ఆదాయం కూడా పెరిగింది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిఠాపురం మున్సిపాలిటీని సెకండ్ గ్రేడ్ నుంచి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు చొరవ తీసుకున్నారు. అధికారులు ప్రతిపాదనలు పంపగానే ఆమోదం తెలిపి సెలక్షన్ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ చేశారు. పిఠాపురం మున్సిపాలిటీ సెలక్షన్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ కావడంతో.. త్వరలో ఇక్కడ గ్రూప్-1 అధికారిని కమిషనర్‌గా నియమించనున్నారు. హోదా పెరగడంతో మున్సిపాలిటీలో ఉద్యోగుల సంఖ్యను కూడా పెంచే అవకాశం ఉంది.

ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు కూడా వచ్చే అవకాశం ఉంది. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు మంచి అవకాశం వస్తుంది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం పిఠాపురం అభివృద్ధి కోసం పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.. తాజాగా పిఠాపురం మున్సిపాలిటీకి సెలక్షన్ గ్రేడ్‌గా మార్చారు.ఏదైనా మున్సిపాలిటీకి వార్షిక ఆదాయం రూ. 8 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉంటే కనుక సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలకు సంబంధించి వివరాలను పరిశీలించి ప్రభుత్వం హోదాను పెంచుతుంది. అంతేకాదు ఈ మున్సిపాలిటీలలో జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్య 20 నుంచి 50 వరకు ఉండొచ్చు. ఏపీ ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీల గ్రేడ్‌ను పెంచింది.. ఇప్పుడు పిఠాపురం మున్సిపాలిటీ గ్రేడ్ కూడా పెంచారు. అంతేకాదు ఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కిందకు తీసుకువచ్చింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదనలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. 37.25 కోట్ల రూపాయలతో పిఠాపురం రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతులు అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు అన్నీ పూర్తి అయితే పిఠాపురం రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ పిఠాపురంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అశుభ్రత, దుర్గంధంతో ఉండటాన్ని పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసరాలను తక్షణం శుభ్రం చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు.అనంతరం ఈ ఏడాది జనవరి నెలలో ఢిల్లీ పర్యటనకు వెళ్లిన పవన్ కళ్యాణ్.. పర్యటనలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమైన పవన్ కళ్యాణ్.. పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి అంశం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమైన పిఠాపురానికి సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని.. వారి సౌకర్యం కోసం పిఠాపురం రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అభివృద్ధి చేయాలని రైల్వే మంత్రిని పవన్ కళ్యాణ్ కోరారు.

# బలమైన వ్యూహంతో కమలం



**విజయవాడ ఏప్రిల్ 17, పెన్ పవర్:** బీజేపీ ఆంధ్రప్రదేశ్ లో బలంగా ఉంది. ప్రజా క్షేత్రంలో బలంగా లేకపోయినప్పటికీ అన్ని బలమైన ప్రాంతీయ పార్టీలతో కమలం పార్టీకి అవగాహన ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకివచ్చినప్పటికీ బీజేపీ అధికారంలోకి వచ్చినట్లే. ఎందుకంటే టీడీపీతో నేరుగా అలయన్స్ లో ఉంటే పార్లమెంటు స్థానాలు, శాసనసభ స్థానాల్లో తమ పార్టీకి ప్రాతినిధ్యం ఉంటుంది. అందుకే టీడీపీ, జనసేనతోఅలయన్స్ ను బీజేపీ గత ఎన్నికలకు ముందు కుదుర్చుకుంది. అదే తెలంగాణలో బీజేపీ బలంగా ఉండటంతో పాటు సెంటిమెంట్ కారణంతో ఆ కూటమి తెలంగాణలో ఏర్పాటు కాలేదు.మాజీ పార్లమెంటుసభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కానీ, వైసీపీ కాని అధికారంలో ఉంటే అది బీజేపీ కూడా అధికారంలో ఉన్నట్లే లెక్క అనుకోవాలి అన్న మాట అక్షర సత్యం. ఏపీలోబీజేపీకి ప్రత్యర్థిపార్టీ అనేది లేదు. ఉన్న జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు లేదు. రాష్ట్ర విభజన కారణంగా ఏపీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారు. అది బీజేపీకి వరంగా మారింది.అందుకే ఏపీలో ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ పెద్దగా రాజకీయంగా ఇబ్బంది ఉండదన్నది వాస్తవం. అందుకే ఏపీలో పార్టీని బలోపేతం చేయడంపై కూడా పెద్దగా నేతలు ఫోకస్ పెట్టడం లేదన్నవాదనలు కూడా ఉన్నాయి.బీజేపీ కేంద్ర నాయకత్వానికి ఏపీ ఒక్కటే ముఖ్యం కాదు. దేశంలో అన్ని రాష్ట్రాలు ముఖ్యం. ప్రధానంగా తాము బలంగా ఉన్న రాష్ట్రాల్లో మరింత బలపడాలంటే అక్కడ ఎక్కువనిధులు కేటాయించాలి. అలాగే ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు ఇవ్వాలి. అప్పుడే అక్కడ మరింత బలోపేతం అవుతామన్నది బీజేపీ ఆలోచన. బీజేపీకే కాదు.. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీనాయకత్వం ఆ విధంగానే ఆలోచిస్తుంది. బీజేపీ తప్పిదం ఇందులో ఏమాత్రం లేదు. బీజేపీ 2029 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్ లో బలోపేతం చేసుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించే అవకాశాలనుకొట్టిపారేయలేం. ఎందుకంటే తమకు ఉత్తరాదిన ఉన్న బలం సరిపోతుంది. అలాగని ఉత్తరాదితో సరిపెట్టుకోకుండా.. దక్షిణాదిన కూడా ప్రాంతీయ పార్టీలను బలహీన పర్చి, తాను బలపడేందుకు ప్రయత్నిస్తుందన్నది విశ్లేషకుల అంచనా. అందుకే బీజేపీకి ఎటు చూసినా ఏపీ విషయంలో లక్కు ఉన్నట్లే కనిపిస్తుంది. ఫ్యాన్ పై విమర్శల వెల్లువఏపీ లో రాజకీయ పార్టీలు అన్నీ ఒక తాను ముక్కలే. టీడీపీ ఎటూ ఎన్డీఏ భాగస్వామి. అందుకే దానిని తప్పుపట్టాల్సిన అవసరం లేదు. పార్లమెంటు లో ఏ బిల్లు పెట్టినప్పటికీ టీడీపీ ఖచ్చితంగా మద్దతుతెలపాల్సిందే. కానీ వైసీపీ ఏపీలో ప్రతిపక్షంలో ఉంది. ఒక రకంగా చెప్పాలంటే గత ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఎదుర్కొని అది 11 స్థానాలకు పరిమితమయింది. అలాంటి వైసీపీ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించేప్రతి బిల్లుకు ఆమోదం తెలుపుతూ.. తలాడిస్తూ ఉండటం.. బీజేపీకి అండగా నిలుస్తుంది. ఇది రాజకీయంగా వైసీపీకి కొంత నష్టం చేకూరుస్తుందన్నది అందరి వాదన. పొరుగున ఉన్న తెలంగాణ,తమిళనాడు రాష్ట్రాల పార్టీలను చూసి అయినా నేర్చుకోండంటూ హితవు చెబుతున్నారు.డీ లిమిటేషన్ కారణంగా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని తెలిసినా తలాడించే పార్టీని ఏపీ ప్రజలుఎందుకు విశ్వసించాలన్న ప్రశ్న సోషల్ మీడియాలో ఎదురవుతుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ ను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏ మాత్రం ఆదుకోవడం లేదు. పోలవరంప్రాజెక్టుకు మినహా.. రాజధాని నిర్మాణానికి కూడా కనీసం నిధులను కూడా ప్రత్యేకంగా కేటాయించలేదు. అలాగే పునర్విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అలాంటి కేంద్ర ప్రభుత్వానికి అండగానిలవడంపై జగన్ పార్టీ నిసోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు. బీజేపీకి బీ టీంగా వ్యవహరిస్తున్నారు.రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిన జగన్ కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే బీజేపీ ప్రభుత్వానికిమద్దతు ప్రకటిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే వైసీపీ నేతల వాదన మరోలా ఉంది. కాంగ్రెస్ పార్టీ తమ పార్టీ అధినేతను పదహారు నెలల పాటు జైలులో ఉంచిందని, రాష్ట్ర విభజనకుకారణమయిన కాంగ్రెస్ తో తాము ఎలా చేతులు కలుపుతామని ప్రశ్నిస్తున్నారు. అయితే రాష్ట్ర విభజన జరిగి పదేళ్లకు పైగా అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి స్వార్థ ప్రయోజనాల కోసంఫ్యాన్ పార్టీ పాకులుండుతుందని, అందుకే ఇలా వ్యవహరిస్తుందని సోషల్ మీడియాలో వైసీపీని విమర్శిస్తున్నారు.

# తెరుచుకోనున్న ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్

**కాకినాడ, ఏప్రిల్ 17, పెన్ పవర్:** కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.. వాకలపూడి సెజ్‌లో ఉన్న రిఫైనరీ ప్లాంట్‌ను మూసివేస్తున్నట్లు కార్మికులకు సమాచారం ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో పాటుగా ఇతర శాఖల అధికారులకు మెయిల్ ద్వారా తెలిపారు. నష్టాలు రావడంతో కంపెనీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. యూనిట్ ప్రారంభించిన దగ్గర నుంచి వరుసగా ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయని చెబుతున్నారు. విదేశాల నుంచి ముడి చక్కెర ఈఐడీ ప్యారీ కంపెనీ అనుబంధ సంస్థ పీఎస్ఆర్ఐపీఎల్ (ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్) ప్లాంట్‌కు దిగుమతి అయ్యేది. ఈ ముడి చక్కెరను ప్లాంట్2లో శుద్ధి చేసి మళ్లీ ఎగుమతి చేసేవారు. ఈ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి ఇబ్బందుల్ని ఎదురవుతున్నాయి. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో రూ.1406 కోట్ల నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ బోర్డు సమావేశంలో ప్లాంట్ మూసివేయాలని డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు, పరిశ్రమలు, ఇతర శాఖలకు సమాచారం ఇచ్చారు.. ప్లాంట్‌కు కాంట్రాక్ట్ కార్మికులు రావొద్దని చెప్పారు.వాకలపూడి సెజ్‌లో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన యూనిట్‌ను ప్రారంభించారు. ముందు ఈ ప్లాంట్‌ను గ్యాస్‌తో నడిపించాలని ప్లాన్ చేసినా.. గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో బొగ్గుతో నడిపించాల్సి వచ్చింది.. ఈ మౌలిక సదుపాయాల కోసం అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. 2015-2016లో ఈ యూనిట్‌లో ప్రొడక్షన్ మొదలైంది.. ప్రారంభంలో రోజుకు రెండే వేల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉంటే.. దానిని 3వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని భావించారు.కానీ మూడు వేల మెట్రిక్ టన్నులకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.. ఆర్థికంగా కూడా నిలదొక్కుకోలేకపోయారు. అలాగే పలు కారణాలతో 2021నుంచి 2022 వరకు రెండు నెలల పాటూ ప్లాంట్‌లు పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత 2022 నుంచి 2023లో వరుసగా ప్రమాదాలు జరిగాయి. దీంతో ప్లాంట్‌ను నెల రోజులకు పైగా మూసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. షిప్పుల్లోకి లోడింగ్ కూడా ఆలస్యం కావడంతో భారీ జరిమానాలు చెల్లించడం ఇబ్బందిగ మారింది. వీటికి తోడు మార్కెట్‌లో చక్కెర ధరలు కూడా తగ్గడంతో మరిన్ని నష్టాలు వచ్చాయి. ఓవైపు రుణభారం కూడా పెరగడంతో యూనిట్‌ను నడపడం లాభదాయకం కాదని భావించారు. అందుకే ఈ యూనిట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం మీద నష్టాల కారణంగా కాకినాడలో ప్యారీ షుగర్స్ రిఫైనరీ ప్లాంట్ మూతపడింది.

# విశాఖపట్నం టు భోగాపురం ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ప్లాన్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 17, పెన్ పవర్:** భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.. అన్నీ కుదిరితే జులై, లేని పక్షంలో ఆగస్టు నెలలో ప్రారంభించే అవకాశం ఉంది. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే విశాఖపట్నంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్‌ను నేవీకి అప్పగించనున్నారు. అప్పుడు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు పెరుగుతాయి. అయితే ఆనందపురం దగ్గర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతుండటంతో కొత్తగా ఫ్లై ఓవర్ ప్లాన్ చేశారు.. అలైన్‌మెంట్ ఫైనల్ చేసి డీపీఆర్ కోసం పంపారు.విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీపై ఏపీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేవారికి కీలకమైన ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి.ఈ క్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయాన్ని గ్రహించి ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టే దిశగా ఆలోచన చేశారు. ఆనందపురం జంక్షన్ మీదుగా.. విశాఖపట్నం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలు.. అటు భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వాహనాలు సాఫీగా వెళ్లేలా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చారు. ఆనందపురం జంక్షన్ దగ్గర భోగాపురం వైపు వెళ్లేలా కొత్తగా ఓ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం వచ్చిన సమయంలో కొత్త ఫ్లై ఓవర్ గురించి ప్రస్తావించారు. ఈ ప్రతిపాదనలకు సీఎం ఓకే చెప్పడంతో అధికారులు ఈ ఫ్లై ఓవర్‌కు సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు చేశారు. 45 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేసి.. ఆమోదం రాగానే పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు.ఇటీవల ఆనందపురం జంక్షన్, కూరగాయల మార్కెట్, పూల మార్కెట్‌లను ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. ప్రస్తుతం ఆనందపురం జంక్షన్ దగ్గర ఉన్న మార్కెట్‌ను మరోచోటికి తరలించాలని ఆలోచన చేస్తున్నారు. ఈ మార్కెట్‌ను తరలిస్తే.. రాబోయే రోజుల్లో ఆనందపురం జంక్షన్ దగ్గర భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంశంపై కూడా ఫోకస్ పెట్టిన అధికారులు.. శాశ్వత పరిష్కారానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇటు అనకాపల్లి వెళ్లే వాహనాలు, అటు భోగాపురం వైపు వెళ్లే వాహనాలకు ఆనందపురం జంక్షన్ దగ్గర ట్రాఫిక్ ఫ్రీ జర్నీ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.మరోవైపు విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ ఉ బీ శాఖలు ఈ రోడ్ల పనులు జరుగుతున్నాయి. విశాఖపట్నం ఎంపీ భరత్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్‌లు ఈ ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. తిమ్మాపురం నుంచి మారికవలస రోడ్డు రహదారి పనులు ముగింపు దశకు వచ్చాయని ఎంపీ భరత్ తెలిపారు. అడవివరం నుంచి శొంఠ్యాం ఆరు లేన్ల రోడ్డుకు అనుమతులు వచ్చాయని.. ఆ పనులు ఊపందుకున్నాయన్నారు. నేరళవలస--కొత్తవలస, బోయపాలెం--కాపులుప్పాడ రహదారులు ఏప్రిల్ చివరినాటికి పూర్తవుతాయన్నారు.పెందుర్తి ప్రాంతంలోని రోడ్డు పనులు మే--జూన్ నాటికి పూర్తి చేసే అవకాశం ఉందని భరత్ తెలిపారు. భీమిలి టు దొరతోట రోడ్డును 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ రోడ్లను నేషనల్ హైవేలతో అనుసంధానానికి ఇప్పటికే అనుమతులు లభించాయన్నారు. జూన్ నాటికి విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఏడు కీలకమైన రోడ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా, పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# చంద్రబాబు స్కెచ్...

**విజయవాడ, ఏప్రిల్ 17 పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీకి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేష్ నియమితులయ్యారు. నిన్ననే తెలుగుదేశం పార్టీ కమిటీలను సమూల ప్రక్షాళన చేసి ప్రకటించారు. సీనియర్లతోపాటు జూనియర్లకు ఎక్కువగా అవకాశాలు ఇచ్చారు. ప్రధానంగా లోకేష్ ఎంపిక వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. ప్రస్తుతానికి పార్టీపై పూర్తి పట్టు సాధించారు లోకేష్. ఈ తరుణంలో తరచు లోకేష్ సీఎం అనే మాట బయటకు వస్తోంది. మరోవైపు చంద్రబాబు యాక్టివ్ గానే ఉన్నారు. మరోసారి ఆయన ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆరోగ్యంతో పాటు వయసు సహకరిస్తుంది. ఎందుకంటే ఆయన పూర్తి ఫిట్నెస్ కు ప్రాధాన్యమిస్తారు. మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఏపీని ఒక రూపంలోకి తేవాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. అయితే జాతీయ స్థాయిలో సమన్వయం ఇప్పుడు ఏపీ ప్రభుత్వానికి అవసరం. ఆ అవసరం దృష్ట్యా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి లోకేష్ కు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.ప్రధానంగా మంత్రి లోకేష్ ఏపీ ప్రభుత్వంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. సీఎం చంద్రబాబు పాలన పై ఫుల్ ఫోకస్ పెట్టారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాతో పాటు గ్రామీణ అభివృద్ధి పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ పరిస్థితుల్లో మంత్రి లోకేష్ విదేశీ పెట్టుబడులపై ఎక్కువగా ఫోకస్ చేశారు. అందులో సక్సెస్ అయ్యారు కూడా. పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుతో పాటు పెట్టుబడులను ఆకర్షించడంలో జాతీయస్థాయి సహకారం అవసరం. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టారు చంద్రబాబు. ఒక విధంగా ఇది లోకేష్ కు పట్టాభిషేకమే.ఏపీ సీఎం చంద్రబాబు ఎన్నో రకాల రాజకీయ కష్టాలు ఎదురయ్యాయి. ఆ సమయంలో ఆయనకు జాతీయస్థాయిలో పరిచయాలు ఎంతగానో దోహదపడ్డాయి. ఆ పరిచయాలతోనే రాజకీయ ఇబ్బందులను అధిగమించగలిగారు చంద్రబాబు. అయితే 2023 సెప్టెంబర్లో చంద్రబాబు అరెస్టు సమయంలో లోకేష్ జాతీయ స్థాయిలో తన తండ్రి అరెస్టుపై గట్టిగానే పోరాటం చేశారు. అప్పటినుంచి చంద్రబాబు సైతం లోకేష్ ను జాతీయస్థాయిలో ప్రమోట్ చేయాలని భావించారు. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర పెద్దలతో లోకేష్ కు సాన్నిహిత్యం పెంచేలా చేశారు. లోకేష్ కూడా తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. కేంద్ర పెద్దలు గుర్తించేలా తనను తాను మార్చుకున్నారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నా కేంద్ర పెద్దల నుంచి లోకేష్ కు పిలుపు వస్తోంది. ఎన్డీఏ పరంగా ఎన్నికల ప్రచారానికి ప్రత్యేక ఆహ్వానం వస్తోంది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోడీ వద్ద కూడా పరపతి పెంచుకున్నారు లోకేష్. యోగాంధ్రా వేడుకలను నిర్వహించి.. సమర్థవంతమైన నాయకత్వం లోకేష్ వద్ద ఉందని గుర్తించేలా చేశారు. ప్రధాని ప్రత్యేకంగా ఆహ్వానించి లోకేష్ తో చర్చలు జరిపారు అంటే ఆయన స్థాయి ఏ స్థాయిలో పెరిగిందో అర్థం అవుతోంది. ప్రస్తుతానికి రాష్ట్ర పాలనలో సీఎం చంద్రబాబుకు డోకా లేదు. పవన్ సాయం ఎలానూ ఉంది. అందుకే జాతీయస్థాయిలో లోకేష్ ను మరింత ప్రమోట్ చేయాలన్న ఉద్దేశంతోనే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇజ్రాయెల్‌-లెబనాన్‌ మధ్య కాల్పుల విరమణ..
## మరోసారి గొప్పలు చెప్పుకున్న ట్రంప్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్, లెబనాన్ దేశాలు 10 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం వెల్లడించారు. గత కొన్ని వారాలుగా రెండు దేశాల సరిహద్దుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న క్రమంలో ఇది అరుదైన దౌత్య పురోగతిగా ఆయన అభివర్ణించారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో, ఇటు లెబనాన్ అధ్యక్షుడు జోసఫ్ ఆన్‌తో అద్భుతమైన సంభాషణలు జరిగినట్టు ట్రంప్ తెలిపారు. 'కాల్పుల విరమణ 5 పీఎం ఈఎస్‌టీకి ప్రారంభమవుతుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా 9 యుద్ధాలను పరిష్కరించడం నాకు దక్కిన గౌరవం. ఇది 10వది. దీనిని కూడా విజయవంతం చేద్దాం' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందానికి ముందు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ రాయబారులు వాషింగ్టన్‌లో సమావేశమయ్యారు. 1980ల తర్వాత ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగడం ఇదే తొలిసారి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటివరకు 2,000 మందికి పైగా మరణించగా, పది లక్షల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. కాగా, దక్షిణ లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో 642 మంది భారత సైనికులు కూడా సేవలందిస్తున్నారు. ఈ కాల్పుల విరమణను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్వాగతించారు. ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇండోనేషియా గగనతలంపై ట్రంప్ కన్ను

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌ను కట్టడి చేసేందుకు ఇరాన్ చుట్టూ ఉన్న శ్రీలంక, భారత గగనతలంపై అనుమతికి అమెరికా చేసిన ప్రతిపాదనలు బెడిసికొట్టాయి. దీంతో తాజాగా ఇండోనేషియా గగనతలంపై పూర్తి స్థాయి ప్రవేశ హక్కులు కల్పించే కుట్రలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్టయింది. ఏప్రిల్ 13న అమెరికా, ఇండోనేషియాలు ఒక కీలక రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి ఒక రోజు ముందు, అమెరికా సైనిక విమానాలకు ఇండోనేషియా గగనతలంపై పూర్తిస్థాయి ప్రవేశం కల్పించే ఒక రహస్య ప్రణాళికకు సంబంధించిన వర్గీకృతపత్రం ఒకటి మీడియా సంస్థ ద్వారా లీక్ అయ్యింది. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో ప్రపంచ చమురు సరఫరాలు తలకిందులైన తరుణంలో, అటువంటి ప్రవేశం అమెరికాకు మరో వాణిజ్య కీలకమైన మలక్కా జలసంధిపై నిఘా ఉంచేందుకు మరింత సామర్థ్యాన్ని ఇచ్చేది. తాజా నివేదిక ఇండోనేషియాలో కలకలం సృష్టించింది. అందువల్ల, రక్షణ ఒప్పందంపై సంతకం చేసినప్పటికీ, అమెరికా విమానాల గగనతల ప్రవేశాన్ని దాని పరిధి నుంచి మినహాయించారు. అమెరికాకు చెందిన ఈ వర్గీకృత పత్రం(సీక్రెట్ అగ్రిమెంట్) పై నివేదికను, కేంద్ర విదేశాంగ మాజీ మంత్రి ఎం.జె. అక్బర్ స్థాపించిన 'సండే గార్డియన్' అనే మీడియా సంస్థ ఏప్రిల్ 12న ప్రచురించింది. ఈ ప్రణాళికను ఫిబ్రవరిలో వైట్ హౌస్‌లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, డోనాల్డ్ ట్రంప్‌ల మధ్య జరిగిన సమావేశంలో చర్చించారు. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, ఇండోనేషియా రక్షణ మంత్రి షాఫ్రీ షామ్సుద్దీన్‌ల మధ్య ఏప్రిల్ 13న జరగాల్సిన సమావేశంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగాల్సి ఉంది. కానీ అది ముందుకు సాగలేదు.

## అమెరికా సైనికులను బందీస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** హోర్ముజ్ జలసంధి వద్ద కొనసాగుతున్న నిర్బంధంపై ఇరాన్ తాజాగా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ నిర్బంధం ఇలాగే కొనసాగితే వేలాది మంది అమెరికా సైనికులను బందీలుగా తీసుకునే అవకాశం ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా నౌకాదళ ఆంక్షలు అమలు చేస్తోంది. ఇరాన్ పోర్ట్‌లను దిగ్బంధనం చేస్తోంది. ఇరాన్ పోర్టుల నుంచి బయటకు వచ్చే, లోపలకి వెళ్లే నౌకలను అమెరికా సైన్యం అడ్డుకుంటోంది. దీని వల్ల ఇరాన్ సముద్ర వాణిజ్యానికి తీవ్రం ఆటంకం కలుగుతోంది. హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నిర్బంధం కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే తాము ప్రయోగించే తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని వార్నింగ్ ఇచ్చింది .

## హోర్ముజ్‌లో కూలిన అమెరికా నిఘా డ్రోన్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా 238 మిలియన్ డాలర్ల (రూ.2,222 కోట్ల) విలువైన నిఘా డ్రోన్‌ను నష్టపోయింది . ఏప్రిల్ 9న హర్మూజ్ జలసంధిలో ఈ ఘటన జరిగినట్టు ఇప్పటికే వార్తలు రాగా.. తాజాగా అమెరికా నేవీ ధ్రువీకరించింది. ఎంక్యూ-4జ ట్రైటన్ పేరున్న దీనిపై ఎటువంటి దాడి జరగలేదని.. సాంకేతిక లోపంతో కూలిపోయినట్టు పేర్కొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదని వెల్లడించింది.అంతర్జాతీయ గగనతలంలో హోర్ముజ్ జలసంధిపై గస్తీలో ఉండగా ట్రైటన్.. అకస్మాత్తుగా ఎమర్జెన్సీ కోడ్‌ను రిలీజ్ చేసింది. ఆ తర్వాత 50వేల అడుగుల ఎత్తు నుంచి 10వేల అడుగుల ఎత్తుకు దిగొచ్చింది. అనంతరం కనిపించకుండా పోయింది. నేవీ సేఫ్టీ కమాండ్ దీనిని క్లాస్ ఏ ప్రమాదం గా వర్గీకరించింది. 2 మిలియన్ డాలర్లకుపైగా నష్టాన్ని, ఎయిర్‌క్రాఫ్ట్ పూర్తిగా ధ్వంసం కావడాన్ని దీనికింద పరిగణిస్తారు. తాజాగా ఈ ప్రమాదాన్ని ధ్రువీకరించిన అమెరికా.. ఏ ప్రాంతంలో జరిగిందో మాత్రం బయటపెట్టలేదు.ఈ ట్రైటన్.. అమెరికా నేవీ ఆయుధశక్తిలో ఈ అధునాతన మానవరహిత వైమానిక వ్యవస్థల్లో ఒకటి. అధిక ఎత్తులో, సుదూర మిషన్ల కోసం దీనిని తీర్చిదిద్దారు. వ్యూహాత్మక జలమార్గాల్లో మారిటైమ్ ట్రాఫిక్, మిలిటరీ కదలికలను పర్యవేక్షించడంలో ఇది కీలకం. ఇప్పుడు దీనిని కోల్పోవడం అనేది యూఎస్ నేవీకి గట్టి దెబ్బే అని చెప్తున్నారు. ఇక, అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించిన అనంతరం ఈ ఘటన జరగడం గమనార్హం.

## డీల్‌కు ఇరాన్ నో అంటే దాడులకు మేం రెడీ....


**హైదరాబాద్ పెన్ పవర్:** శాంతి ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే మళ్లీ దాడులు మొదలుపెడతామని అమెరికా హెచ్చరించింది. తమ మిలిటరీ బలగాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది. గతం కంటే మరింత బలీయంగా పోరుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ దేశ రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు. ఈ మేరకు పెంటగాన్‌లో ఇరాన్ అంశంపై మీడియాతో మాట్లాడారు. అవసరమైతే ఇరాన్ పోర్టుల నుంచి నౌకల రాకపోకలు దీర్ఘకాలం అడ్డుకునేందుకు సిద్ధమన్నారు. "ఒక సుసంపన్నమైన భవిష్యత్ కోసం, తమ దేశ పౌరుల కోసం ఇరాన్ ఒక మంచి నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నా. అలా కాకుండా అవివేకంగా వ్యవహరిస్తే మాత్రం నౌకల రాకపోకలు స్తంభింపజేస్తాం. ఇంధన మౌలిక సదుపాయాలపై, విద్యుత్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపిస్తాం" అని హెచ్చరించారు. ఈ విరామ సమయంలో అమెరికా సంయుక్త దళాలు తమ పోరాటాన్ని తిరిగి కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని.. అందుకు అత్యంత చేరువగా ఉన్నామని ట్రంప్ బుధవారం పేర్కొన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. కాల్పుల విరమణ గడువు పొడిగింపునకు కాకుండా, శాశ్వత శాంతి ఒప్పందంవైపే తాము మొగ్గుచూపుతున్నామని అన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు ఈ నెల 22తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చుకునేలా ఆ దేశంపై అమెరికా ఒత్తిడి పెంచుతున్నట్లు కనిపిస్తోంది.

## ఇరాన్-యూఎస్ రెండో దఫా చర్చలు.. టెహ్రాన్ చేరుకున్న పాక్ ఆర్మీ చీఫ్



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ నాయకత్వంతో చర్చల కోసం పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ బుధవారం టెహ్రాన్ చేరుకున్నారు. అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీతో కూడిన ప్రతినిధి బృందంలో మునీర్ కూడా ఉన్నారని సైనిక మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ ఒకప్రకటనలో తెలిపింది. మధ్యవర్తిత్వ ప్రయత్నాల్లో భాగంగా వారిరువురు ట్రెహాన్ చేరుకున్నారని, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి వారికి స్వాగతం పలికినట్లు ఆ ప్రకటన తెలిపింది. ఇరాన్ నాయకత్వానికి అమెరికా సందేశాన్ని అందించడం, తదుపరి దశ చర్చల కోసం వ్యూహాత్మక ప్రణాళికను రచించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొంది. వారాంతంలో ఇస్లామాబాద్ లో జరిగిన చర్చలు ఎటువంటి పురోగతి లేకుండా ముగిసిన తర్వాత, పాకిస్తాన్ ద్వారా అమెరికా సందేశాల మార్పిడి కొనసాగిందని బుధవారం ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయిీ ధృవీకరించారు. ఆదివారం ఇరాన్ ప్రతినిధి బృందం టెహ్రాన్ కు తిరిగి వచ్చినప్పటి నుండి, పాకిస్తాన్ నుండి పలు సందేశాలు అందాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా ఇర్నా తెలిపింది. ఒక పక్షం మరో పక్షంపై ఆంక్షలు విధించడం ఆధారంగా చర్చలు జరిగితే, అవి చర్చలు కావని, ఆదేశించడం లేదా బలవంతంగా రుద్దడం అవుతుందని అన్నారు. ఇరాన్ ఎప్పటికీ ఆ ఆంక్షలకు లొంగదని అన్నారు. అధికారిక పర్యటన కోసం ఇరాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బుధవారం సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ వెళ్లినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది.

# నోయిడాలో ఎంఎ బేబీ పర్యటన



**హైదరాబాద్ పెన్ పవర్:** పోలీసులు అరెస్టు చేసిన, వారు చేతిలో దారుణంగా దెబ్బలు తిన్న నాయకుల, కార్మికుల కుటుంబాలను పరామర్శించేందుకు నోయిడాలో శుక్రవారం సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ పర్యటించనున్నారు. నోయిడా, పరిసర ప్రాంతాల్లో మెరుగైన వేతనాలు, ఇతర డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న కార్మికులపై ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు అరెస్టులు, లాఠీఛార్జీలు, నిర్భంధనాలు, దేశవ్యతిరేక ఆరోపణలతో తీవ్రస్థాయిలో అణిచివేతకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. గురువారం ముందుగా ఉదయం 9 గంటలకు సిపిఎం కేంద్ర కమిటీ కార్యాలయం ఎకె గోపాలన్ భవన్ నుంచి పార్టీ పార్లమెంట్ సభ్యులతో కలిసి ఎంఎ బేబీ బయలుదేరనున్నారు. నోయిడా సెక్టార్ 8లో బాన్స్‌బల్లి ఒమార్కెట్ వద్ద నిర్బంధంలో ఉన్న నాయకుల కుటుంబాలతో బేబీ సమావేశం కానున్నారు. అనంతరం వీరితో కలిసి ఉదయం 11 గంటలకు జిల్లా మేజిస్ట్రేట్‌ను కలుస్తారు. ఈ కార్యక్రమం తరువాత పోలీసులు అరెస్టు చేసి, వారి దాడిలో గాయపడిన కార్మికుల కుటుంబాలను ఎంఎ బేబీ పరామర్శిస్తారు.

## సమాఖ్యవాదంపై దాడి రాజ్యాంగ 131వ సవరణ బిల్లుపై సిపిఎం

**హైదరాబాద్ పెన్ పవర్:** సమాఖ్య సూత్రాలను దెబ్బతీస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సిపిఎం ఎంపి కె రాధాకృష్ణన్ లోక్‌సభలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన రూల్ 72 కింద నోటీసు ఇచ్చారు. సభలో కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామిక వ్యతిరేక చర్యలను తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగ సవరణలు సమాఖ్యవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి విలువలను నిలబెట్టాలన్నారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ఇతర పార్టీలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. ఇది సహకార సమాఖ్యవాద స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. '2023 సెప్టెంబర్ 28న ఆమోదించిన 'నారీ శక్తి వందన అధినియమ్' (మహిళా రిజర్వేషన్ చట్టం)ను జనాభా లెక్కలు అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ, ఇంకా జనాభా లెక్కలు నిర్వహించడానికి కూడా సిద్ధంగా లేని ప్రభుత్వం, ఆ వాగ్దానాన్ని మరిచిపోయి కొత్త సవరణతో ముందుకు రావడం వింతగా ఉంది' అని విమర్శించారు. 'రాబోయే ఎన్నికలకు ముందు ఈ కొత్త బిల్లు ఒక రాజకీయ నాటకం. ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్కరణల కంటే రాజకీయ లబ్ధికే ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రాల అధికారాన్ని హస్తగతం చేసుకుని, కేంద్రంలో అధికారాన్ని కూడగట్టేందుకు ఇది ఒక ఎత్తుగడ. తగినంత చర్చలు లేకుండా ఇలాంటి కీలకమైన సవరణలను హడావిడిగా ఆమోదించడం ప్రజాస్వామ్య వ్యతిరేకం' అని అన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను, రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే ఈ బిల్లును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. కొత్త సవరణలు తీసుకురావడానికి ముందు, ప్రస్తుతం ఆమోదించిన మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయడానికి జనాభా లెక్కల ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన చర్యలను పార్లమెంటు లోపల, వెలుపల తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఎస్‌ఎఫ్‌ఐ నేత గులేరియా హత్యను నిరసిస్తూ ఢిల్లీలోని హిమాచల్‌భవన్ వద్ద ధర్నా

**హైదరాబాద్ పెన్ పవర్:** హిమాచల్‌ప్రదేశ్‌లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్‌ఎఫ్‌ఐ) నేత, బిబిఎ విద్యార్థిని సియా గులేరా (19) దారుణ హత్యను ఖండిస్తూ న్యూఢిల్లీలోని హిమాచల్‌భవన్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గురువారం నాడు ధర్నా చేపట్టారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు హిమాచల్‌ప్రదేశ్ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా నేతలను ఢిల్లీ పోలీసులు, ఆర్‌పిఎఫ్ బలగాలు అడ్డుకున్నాయి. ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం సాజీ,ఉపాధ్యక్షులు సుభాష్ జాఖర్, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షులు సూరజ్ ఎలామన్, ఐద్వా అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఆశా శర్మ, ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కవితా శర్మతో సహా 40 మంది పైగా విద్యార్థి, మహిళా సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి..అక్కడి నుంచి బలవంతంగా తరలించారు. ఈ నెల 13న హిమాచల్‌ప్రదేశ్‌లో మండిలోని గోపాలపురంలో కళాశాలకు వెళ్తున్న సమయంలో పట్టపగలే సియా గులేరాను గుర్తు తెలియని దుండగులు మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ఈ దాడిని ఖండిస్తూ హిమాచల్‌ప్రదేశ్ లో పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే 'జస్టిస్ ఫర్ సియా గులేరియా' నినాదంతో ఢిల్లీలో ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గులేరియా హత్యపై సమగ్ర విచారణ చేపట్టి, దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే అరెస్టు చేసిన నిందితులు మత్తుపదార్థాలు తీసుకున్నట్లు తేలిందని, రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారి ఎంతటి భయానకంగా ఉందో ఈ ఘటన తెలియజేస్తోందన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సియా గులేరియాకు న్యాయం జరగాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డిమాండ్ చేశారు.




# సమాన, న్యాయబద్ధమైన పునర్విభజన జరగాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ : ఒంటెద్దు పోకడతో కాకుండా అన్ని రాష్ట్రాలకూ, ప్రాంతాలకూ సమానమైన, న్యాయబద్ధమైన రీతిలోనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఇదివరకే స్పష్టం చేసింది. విస్తృత సంప్రదింపుల ద్వారా ఏకాభిప్రాయంతో ఈ ప్రక్రియ చేపట్టాల్సివుంటుందని తేల్చి చెప్పింది. ఈ మేరకు పార్టీ 24వ అఖిల భారత మహాసభలో ఒక తీర్మానం కూడా చేసింది. ప్రస్తుతం పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును ముడి పెట్టి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని సర్వత్రా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో సిపిఎం 24వ మహాసభ తీర్మానాన్ని ఆకలింపు చేసుకోవడం ఎంతో అవసరం?నాటి తీర్మాన పాఠం ఇక్కడ అందిస్తున్నాం.. పార్లమెంట్‌లో ఏ రాష్ట్రానికైనా వుండే దామాషా ప్రాతినిధ్య వాటాను తగ్గించే లేదా కుదించే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను దేనినైనా

సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈ కీలకమైన అంశంపై స్థూలంగా ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు అన్ని రాజకీయ పార్టీలతో, రాష్ట్ర ప్రభుత్వాలతో విస్తృతంగా చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని మహాసభ కోరుతోంది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల సీట్ల సంఖ్యపై గల స్తంభన వచ్చే ఏడాది చివరితో పూర్తి కానుండడంతో 2026 తర్వాత మొదటి జనగణన నిర్వహించిన అనంతరం తాజాగా నియోజకవర్గాల పునర్విభజన అవసరమవుతుంది. 1976లో ఎమర్జన్సీ సమయంలో తీసుకువచ్చిన 42వ రాజ్యాంగ సవరణ, జనాభా నియంత్రణ చర్యలను పెంపొందించేందుకు వీలుగా తొలుత సీట్ల కేటాయింపులను స్తంభింపచేసింది. ఈ స్తంభనను తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం 2026 వరకు పొడిగించింది. చారిత్రకంగా, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలు 1952, 1963, 1973ల్లో నిర్వహించారు. అయితే, 1976లో స్తంభన నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన పున:పంపిణీపై నెలకొన్న ఆందోళనలను పరిష్కరించేందుకు తదనుగుణమైన సద్దుబాట్లు వాయిదా వేశారు.

# ఇరాన్ యుద్ధంతో రెస్టారెంట్లకు రూ. 79,000 కోట్ల నష్టం



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా కమర్షియల్ ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీనివల్ల దేశంలోని రెస్టారెంట్ రంగం తీవ్రమైన ఇంధన కొరతను ఎదుర్కొంటోంది. పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) తాజా నివేదిక ప్రకారం, గ్యాస్ కొరత కారణంగా దేశంలోని రెస్టారెంట్ పరిశ్రమ నెలకు సుమారు రూ. 79,000 కోట్ల ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోంది. రోజువారీ కార్యకలాపాలకు ఎల్‌పీజీపై అధికంగా ఆధారపడే ఈ రంగానికి ఇది పెద్ద దెబ్బ. పరిశ్రమ అంచనాల ప్రకారం, మనదేశంలో ఆహార సేవల మార్కెట్ వేగంగా పెరుగుతోంది. 2024లో ఈ రంగం విలువ రూ. 5.69 లక్షల కోట్లుగా ఉండగా, 2028 నాటికి రూ. 7.76 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. 2026 నాటికి ఇది సుమారు రూ. 6.46 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. దీని ప్రకారం, ఈ రంగం రోజుకు సుమారు రూ. 17,700 కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ప్రస్తుత ఇంధన సమస్య కారణంగా రెస్టారెంట్ పరిశ్రమ 15-20 శాతం క్షీణించిందని నివేదిక చెబుతోంది. దీంతో రోజుకు రూ. 2,650 కోట్లకు పైగా నష్టపోతోంది. అంటే నెలకు రూ. 79 వేల కోట్లకు పైనే. ఇప్పటికే ఈ సంక్షోభ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. భారత రెస్టారెంట్ అసోసియేషన్ ప్రకారం, దాదాపు 10 శాతం రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. మరో 60-70 శాతం సంస్థలు పరిమిత సామర్థ్యంతో మాత్రమే పనిచేస్తున్నాయి. అనేక రెస్టారెంట్లు ప్రస్తుతం ఇండక్షన్ స్టవ్, ప్రత్యామ్నాయ ఇంధనం, తగ్గించిన మెనూ, తక్కువ పని గంటలతో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు సాగర్ దర్యాణి పేర్కొన్నారు.

# విప్రో భారీ బైబ్యాక్ ధమాకా




ప్రముఖ ఐటి దిగ్గజం విప్రో తన వాటాదారులకు తీపి కబురు అందించింది. కంపెనీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో రూ.15,000 కోట్లతో షేర్ల బైబ్యాక్ (తిరిగి కొనుగోలు) చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఒక్కో షేరును రూ.250 చొప్పున కొనుగోలు చేయాలని కంపెనీ నిర్ణయించింది. గురువారం మార్కెట్ ముగిసే సమయానికి ఉన్న షేరు ధర రూ.210తో పోలిస్తే, ఇది దాదాపు 19 శాతం అధికం కావడం విశేషం. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ రూట్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నివేదికలో విప్రో వెల్లడించింది. ఇది కంపెనీ మొత్తం పెయిడ్ అప్ షేర్ క్యాపిటల్‌లో 5.7 శాతానికి సమానం. ఇందుకు సంబంధించిన రికార్డు తేదీని త్వరలోనే ప్రకటించనుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో విప్రో నికర లాభాలు 2 శాతం తగ్గి రూ.3,502 కోట్లుగా చోటు చేసుకున్నాయి. కంపెనీ ఆదాయం మాత్రం 8 శాతం పెరిగి రూ.24,236 కోట్లుగా నమోదయ్యింది. డిసెంబర్ త్రైమాసికంతో పోల్చినప్పుడు లాభంలో 12 శాతం పెరుగుదల కనిపించడం కొంత ఊరటనిచ్చే అంశం.

# ఈయూ కార్బన్ ట్యాక్స్‌తో భారతీయ ఎగుమతిదారులకు కొత్త సవాళ్లు



యూరోపియన్ యూనియన్(ఈయూ) అమలు చేస్తున్న కార్బన్ ట్యాక్స్ భారతీయ ఎగుమతిదారులు కొత్త సవాళ్లను తెచ్చే అవకాశం ఉంది. కార్బన్ ఉద్గారాలను నియంత్రించేందుకు అమలు చేస్తున్న ఈయూ కర్బన సరిహద్దు సర్దుబాటు విధానాన్ని(సీబీఏఎం) మరిన్ని రంగాలకు విస్తరించాలని యోచిస్తోంది. 2028, జనవరి నుంచి దీన్ని విస్తృత స్థాయిలో అమలు చేసే అవకాశముంది. కార్బన్ ట్యాక్స్ అంటే ఈయూ దేశాల్లోకి దిగుమతి అయ్యే కొన్ని రకాల వస్తువుల తయారీలో విడుదలయ్యే కర్బన ఉద్గారాల ఆధారంగా విధించే పన్ను. దీని ద్వారా అంతర్జాతీయంగా కాలుష్యాన్ని తగ్గించడం ఈయూ లక్ష్యం. ప్రస్తుతం ఈ పన్ను ఇనుము, ఉక్కు, అల్యూమినియం, సిమెంట్, ఎరువులు, హైడ్రోజన్, విద్యుత్ వంటి భారీ పరిశ్రమలకు మాత్రమే అమలు చేస్తోంది. ఇవి అధిక కాలుష్యం కలిగిన రంగాలు. అయితే, ఇప్పుడు యూరోపియన్ పార్లమెంట్ కమిటీ ఈ పన్ను పరిధిని మరింత విస్తరించాలని సిఫార్సు చేసింది. ఇందులో ఇంజనీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, యంత్రాలు, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు వంటి మరిన్ని పారిశ్రామిక రంగాలను చేర్చే అవకాశం ఉంది. ఈ మార్పులు అమల్లోకి వస్తే భారతీయ ఎగుమతిదారులకు కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఎందుకంటే ఈయూకు ఎగుమతి చేసే వస్తువులపై అదనపు ఖర్చు పెరుగుతుంది, దీని వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ తగ్గే ప్రమాదం ఉంది. భారత్, ఈయూ మధ్య కుదిరిన ఎఫ్‌టీఏ వల్ల సుంకాలు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, సీబీఏఎం కారణంగా భారత ఎగుమతులపై అదనపు భారం పడే పరిస్థితి ఏర్పడుతుంది.

# అగాధంలోకి ఆభరణాల ఎగుమతులు



భారత రత్నాలు, ఆభరణాల రంగం ఊహించని సంక్షోభంలో చిక్కుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26లో ఈ రంగం ఎగుమతులు ఐదేండ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయని రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) వెల్లడించింది. ముఖ్యంగా మన దేశానికి ప్రధాన కొనుగోలుదారు అయిన అమెరికా విధించిన భారీ సుంకాలు ఈ పతనానికి ప్రధాన కారణమయ్యాయని తెలిపింది. 2025-26లో మొత్తం ఎగుమతులు 27.72 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇంతక్రితం ఏడాదిలోని 28.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 3.3 శాతం తగ్గుదల. కరోనా లాక్‌డౌన్‌ల సమయంలో వాణిజ్యం పూర్తిగా నిలిచిపోయిన 2020-21 కాలం తర్వాత ఎగుమతులు ఇంత కనిష్ట స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అమెరికాకు జరిగే ఎగుమతులు దాదాపు సగానికి పడిపోవడమే. అమెరికా విధించిన కొత్త సుంకాలు, దిగుమతి పన్నుల కారణంగా భారతీయ ఆభరణాలకు గిరాకీ తగ్గింది. గ్లోబల్ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు లక్షలాది మంది కళాకారులు, వ్యాపారులపై ఆధారపడి నడుస్తున్న ఈ పరిశ్రమ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

# టీసీఎస్ ఘటనతో అలర్ట్ అయిన ఐటీ కంపెనీలు




ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్ నాసిక్ కార్యాలయంలో లైంగిక వేధింపుల ఆరోపణలు ఐటీ పరిశ్రమను కుదిపేస్తున్నాయి. ఈ ఘటన తర్వాత వేధింపులు, పని సంస్కృతిపై పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకుంటూ అనేక ఆరోపణలు చేస్తున్నారు. ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా, తమ కంపెనీ ఆఫీస్ ప్యాంట్రీని 'ఫుట్‌వేర్-ఫ్రీ జోన్'గా ప్రకటించిందని ఎక్స్‌లో ఓ పోస్ట్ వైరల్ అయింది. ఆ పోస్టులో కంపెనీ ఆఫీస్ ప్యాంట్రీని 'ఫుట్‌వేర్-ఫ్రీ జోన్'గా ప్రకటించడం మతపరమైన పక్షపాతానికి ఉదాహరణ అని ఆరోపించారు. అయితే, దీన్ని కంపెనీ ఖండించింది. ఆ ఫోటో తమ ఆఫీస్‌కి సంబంధించింది కాదని, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం అవాస్తవమని కంపెనీ స్పష్టం చేసింది. తమ సంస్థలో మతంతో పాటు ఎలాంటి వివక్షకు చోటు లేదని, ప్రతి ఉద్యోగిని గౌరవంగా, సమానంగా చూసే వాతావరణం ఉందని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరో సందర్భంలో ఇన్ఫోసిస్ కూడా వేధింపులు, వివక్ష పట్ల కంపెనీలో జీరో టోలరెన్స్ విధానాన్ని పాటిస్తున్నామని ప్రకటించింది. అయినప్పటికీ, కొన్ని సంస్థల్లో ఉద్యోగులు వేధింపుల గురించి ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఇలాంటి ఘటనలు పూర్తిగా తగ్గాలంటే ఫిర్యాదుల వ్యవస్థలను బలోపేతం చేయాలని హెచ్‌ఆర్ నిపుణులు సూచిస్తున్నారు. కంపెనీల్లో రూల్స్ ఉన్నా, ఉద్యోగులు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. ప్రతీకార చర్యలు, న్యాయం జరగదేమోననే సందేహాలు వారిని వెంటాడుతున్నాయి. ఫిర్యాదులపై విచారణలో పారదర్శకత ఉండాలని, ఉద్యోగులు భయపడకుండా ముందుకు వచ్చేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని పేర్కొంటున్నారు.

# సర్ఫ్, డవ్ సహా ఉత్పత్తుల ధరలు పెంచిన హెచ్‌యూఎల్





ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందూస్తాన్ యూనిలీవర్(హెచ్‌యూఎల్) వివిధ రకాల ఉత్పత్తుల ధరలను పెంచుతున్నట్టు గురువారం ప్రకటించింది. పెరుగుతున్న ముడి పదార్థాలు, ప్యాకేజింగ్ ఖర్చుల భారం కారణంగా సబ్బులు, టీపొడుల ధరలను రూ. 1 నుంచి రూ. 20 వరకు పెంచినట్టు తెలిపింది. ముఖ్యంగా డవ్, లిరిల్, పియర్స్ సబ్బుల ధరలను రూ. 2-3 మేర పెంచింది. ఈ పెంపు తర్వాత 100 గ్రా. డవ్ సీరమ్ రూ. 60కి, డవ్ పింక్ రూ. 70కి, పియర్స్ రూ. 45కి, లిరిల్ రూ. 41కి చేరింది. వీటితో పాటు రెడ్ లేబుల్, సర్ఫ్ ధరలు కూడా హెచ్‌యూఎల్ పెంచింది. సర్ఫ్ ధరను బరువును బట్టి రూ. 5-20, రెడ్ లేబుల్ ధరను రూ. 2-10 మధ్య పెంచింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం కారణంగా సబ్బుల తయారీలో కీలకమైన పామాయిల్, ప్లాస్టిక్‌ల ధరలు గణనీయంగా పెరిగాయి. ధరల పెరుగుదలకు తోడు సరఫరా, రవాణా, ఇంధన ఖర్చులు కూడా ఇందుకు కారణమని కంపెనీ పేర్కొంది.

# మహిళా పారిశ్రామికవేత్తల కోసం లీడ్‌హర్‌షిప్: ఆదిత్య బిర్లా క్యాపిటల్





ఆర్థిక సేవల (ఫిన్‌టెక్) రంగంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ (ఏబీసీఎల్) 'లీడ్‌హర్‌షిప్' అనే సరికొత్త మార్గదర్శక కార్యక్రమాన్ని ప్రారంభించింది. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల్లో నాయకత్వ స్థానాలకు మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో ఇన్ఫినిటీ కింద దీనికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా, ప్రారంభ దశలో ఉన్న మహిళా స్టార్టప్ వ్యవస్థాపకులకు ఆదిత్య బిర్లా క్యాపిటల్‌లోని సీనియర్ మహిళా నాయకులు మూడు నెలలపాటు ప్రత్యేకంగా మార్గదర్శకత్వం వహిస్తారు. వ్యాపార సవాళ్లను అధిగమించి, స్థిరమైన వృద్ధిని సాధించేలా వారికి అండగా నిలుస్తారు. ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనే తమ లక్ష్యానికి ఈ కార్యక్రమం నిదర్శనమని సంస్థ ఎండీ, సీఈఓ విశాఖ ముల్యే పేర్కొన్నారు. లీడ్‌హర్‌షిప్ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు బీ-ఫెయిర్ ల్యాబ్స్‌తో సంస్థ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

# ఒక కిలోమీటర్ వాకింగ్ చేస్తే బాడీలో ఎంత కొవ్వు కరుగుతుందా?




మీరు బరువు తగ్గాలనుకుంటున్నారా? అయితే గంటల తరబడి శ్రమ పడనక్కర్లేదు. రోజుకు కేవలం ఒక కిలోమీటరు నడకతో మీ ఆరోగ్యాన్ని ఎలా మార్చుకోవచ్చో మీకు తెలుసా? ఒక కిలోమీటరు నడకలో ఎన్ని కేలరీలు కరుగుతాయి? ఇది నిజంగా బరువు తగ్గడానికి సహాయపడుతుందా? నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్ కోసం జిమ్‌లు, కఠినమైన డైట్‌లు అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ ఎటువంటి ఖర్చు లేకుండా అన్ని వయసుల వారు పాటించగలిగే అత్యంత సులభమైన వ్యాయామం నడక. రోజుకు కనీసం ఒక కిలోమీటరు నడవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.సాధారణంగా ఒక కిలోమీటరు నడవడం వల్ల 60 నుండి 100 కేలరీల వరకు శక్తి ఖర్చవుతుంది. అయితే ఈ కేలరీల ఖర్చు అనేది వ్యక్తి యొక్క బరువు, ఎత్తు మరియు నడిచే వేగంపై ఆధారపడి ఉంటుంది. మీరు ఎంత వేగంగా నడిస్తే, అంత ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి. బరువు తగ్గాలనుకునే వారు సాధారణ నడక కంటే వేగంగా నడవటం మంచిది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ నడవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. నడక వల్ల శరీరంలో ఒత్తిడిని తగ్గించే హార్మోన్లు విడుదలవుతాయి. ఇది మానసిక స్థితిని మెరుగుపరిచి, డిప్రెషన్ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణక్రియ – బరువు: నడక వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి మలబద్ధకం వంటి సమస్యలు దూరమవుతాయి. అంతేకాకుండా ఇది మెదడుకు విశ్రాంతినిచ్చి రాత్రిపూట గాఢ నిద్ర పట్టేలా చేస్తుంది. కేవలం నడకతోనే బరువు తగ్గడం సాధ్యం కానప్పటికీ, సరైన ఆహార నియమాలతో పాటు రోజువారీ నడకను కలిపితే శరీర బరువులో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. ఒక కిలోమీటరు నడక అనేది వినడానికి చిన్నదిగా అనిపించినప్పటికీ, దీనిని ఒక అలవాటుగా మార్చుకుంటే నెల రోజుల్లో వేల సంఖ్యలో కేలరీలను ఖర్చు చేయవచ్చు. ఉదయం నిద్రలేవగానే నోటి రుచి మారడం వంటి సమస్యలు ఎదుర్కొనే వారు కూడా వారి దినచర్యలో నడకను చేర్చుకోవడం ద్వారా శరీర జీవక్రియలను క్రమబద్ధీకరించుకోవచ్చు. పెద్దగా శ్రమ పడకుండా ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి వాకింగ్ ఒక సంజీవని లాంటిది.

# ఉతకకుండా కొత్త డ్రెస్‌లు వేసుకుంటున్నారా?



చాలా మంది కొత్త డ్రెస్ లు వేసుకోవడానికి ఇష్టపడతారు. అయితే, అసలు వాష్ చేయకుండా వేసుకోవడం మంచిదేనా? అయితే, కొన్ని సందర్భాల్లో అయితే ఇది ప్రమాదకరంగా మారనుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. మనలో చాలా మంది కొత్త డ్రెస్ లు వేసుకోవడానికి ఇష్టపడతారు. అయితే, అసలు ఇలా వేసుకోవడం మంచిదేనా? కొన్ని సార్లు అయితే ఏం కాదు కానీ, మరి కొన్ని సందర్భాల్లో అయితే ఇది ప్రమాదకరంగా మారనుంది. అంతేకాదు, అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త డ్రెస్‌లు ఉతకకుండా వేసుకోవడం వలన చర్మ సమస్యలు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, షాపింగ్ మాల్స్ లో అందరూ చేసే పని ఇది. బట్టల షాప్ లోకి వెళ్ళగానే ట్రైల్స్ వేస్తారు. ఎందుకంటే, వీటి తయారీకి అనేక రంగులు వాడుతారు. ఇంకా వీటిలో ఫార్మాల్డిహైడ్ వంటి రసాయనాలు కూడా వాడతారు. ఇవి అంత మంచివి కావు. కాబట్టి, వీటిని వేసుకునేటప్పుడు ఒకటికి రెండు సార్లు అలోచించి వేసుకోండి. ఇంకా చాలా మంది షోరూమ్‌లలో ట్రయల్ వేస్తారు. దీని వలన చర్మ వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా, పిల్లల చర్మం సెన్సిటివ్ కాబట్టి, వారికి ఇలాంటి దుస్తులను ఉతికిన తర్వాతే వేయండి లేదంటే అనారోగ్య మస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు.

# మసాలా దినుసులు.. బంగారం ధర కంటే ఎక్కువట..!



దాదాపు ప్రతి ఇంటి వంట గదిలో మసాలా దినుసులు ఉంటాయి. ఇవి వంటల రుచిని పెంచడానికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయి. అయితే ఇందులో కొన్ని మసాలా దినుసులకు బంగారంతో సమానమైన ప్రాముఖ్యత ఉంది. నేటికీ మార్కెట్లో కొన్ని మసాలాల ధరలు సామాన్యుడి ఊహకు అందని విధంగా ఉన్నాయి. ఈ ధర కేవలం మార్కెటింగ్ కారణంగానే కాకుండా వాటి ఉత్పత్తి, పరిమిత లభ్యత కారణంగా కూడా ఏర్పడుతుంది. దాదాపు ప్రతి ఇంటి వంట గదిలో మసాలా దినుసులు ఉంటాయి. ఇవి వంటల రుచిని పెంచడానికే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయి. అయితే ఇందులో కొన్ని మసాలా దినుసులకు బంగారంతో సమానమైన ప్రాముఖ్యత ఉంది. నేటికీ మార్కెట్లో కొన్ని మసాలాల ధరలు సామాన్యుడి ఊహకు అందని విధంగా ఉన్నాయి. ఈ ధర కేవలం మార్కెటింగ్ కారణంగానే కాకుండా వాటి ఉత్పత్తి, పరిమిత లభ్యత కారణంగా కూడా ఏర్పడుతుంది. కుంకుమపువ్వు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసుగా పరిగణించబడుతుంది. కుంకుమపువ్వును క్రోకస్ అనే పువ్వు సున్నితమైన భాగాల నుంచి తయారు చేస్తారు. ఒక కిలో కుంకుమపువ్వును పొందడానికి లక్షలాది పువ్వులు అవసరం. ఈ ప్రక్రియ మొత్తం చేతితోనే చేస్తారు. అందుకే ఒక కిలో కుంకుమపువ్వు ధర సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుంది. ఇంగువను ఒక ప్రత్యేకమైన మొక్క జిగురు నుంచి తయారు చేస్తారు. దీనిని సాగు చేసి, జిగురును తీసే ప్రక్రియ చాలా కష్టమైనది, సమయం కూడా ఎక్కువగా తీసుకుంటుంది. మన దేశంలో స్వచ్ఛత రకాన్ని బట్టి ఇంగువ ధర కిలోకు రూ. 10,000 నుండి రూ. 35,000 వరకు ఉంటుంది. ప్రత్యేకమైన సువాసనకు ప్రసిద్ధి చెందిన యాలకులను మసాలా దినుసుల రాణి అని పిలుస్తారు. యాలకుల సాగుకు నిర్దిష్ట వాతావరణ పరిస్థితులు అవసరం. దీనిని పూర్తిగా చేతితోనే కోయాలి. ప్రస్తుతం, యాలకుల మార్కెట్ ధర కిలోకు సుమారు రూ. 2,850గా ఉంది. లవంగాలు వాస్తవానికి ఎండిన పూల మొగ్గలు. వాటిని సరైన సమయంలో కోయడం వల్ల వీటిని తయారు చేస్తారు. ప్రధానంగా ఇండోనేషియాలో ఉత్పత్తి అయ్యే లవంగాల ధర ప్రస్తుతం కిలోకు రూ. 1,300 నుంచి రూ. 2,299 మధ్య ఉంది. చెట్టు బెరడు నుంచి తయారయ్యే దాల్చినచెక్క అత్యంత స్వచ్ఛమైనదిగా, ఖరీదైనదిగా పరిగణించబడుతుంది. ఇది శ్రీలంకలో ఉత్పత్తి అవుతుంది. నాణ్యతను బట్టి దాల్చినచెక్క ధర కిలోకు రూ. 600 నుండి రూ. 1500 వరకు ఉంటుంది.

# పనస పండు వీరికి యమడేంజర్




పనస పండు.. ప్రకృతి మనకు ప్రసాదించిన అద్భుతమైన ఫలం. రుచిలోనే కాదు, శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలను అందించడంలోనూ పనసకు సాటిలేదు. ముఖ్యంగా పురుషులకు ఇది ఎంతో మేలు చేస్తుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రీసెర్చ్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ టెక్నాలజీ అధ్యయనం ప్రకారం.. ఈ పండు అందరికీ సెట అవ్వదు.. కొన్ని సమస్యలు ఉన్నవారు వీటిని తినకూడదు. వేసవి వచ్చిందంటే మామిడి పండ్లతో పాటు మార్కెట్లో నోరూరించే మరో పండు పనస. ఆ సువాసన వింటేనే చాలు, తినని వారు కూడా ఒక్క ముక్కైనా రుచి చూడాలనుకుంటారు. రుచిలో తీయగా, గుజ్జు ఎంతో మృదువుగా ఉండే పనస పండులో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇది అందరికీ మేలు చేయదని, కొందరికి ఈ పండు విషంతో సమానమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంతకీ పనస పండును ఎవరు తినాలి..? ఎవరు దూరంగా ఉండాలి..? అనే విషయాలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. పనస పండులో నీటి శాతం, పీచు పదార్థం అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీనిలోని విటమిన్లు, ఖనిజాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి.ఇందులోని విటమిన్–సి ఇమ్యూనిటీని పెంచి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. పనస పండు పురుషులలో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని, అంగస్తంభన సమస్యలను తగ్గిస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై ముడతలు రాకుండా కాపాడుతాయి, జుట్టు ఆరోగ్యంగా పెరగడానికి దోహదపడతాయి. రక్తహీనత సమస్యతో బాధపడేవారికి పనస ఒక మంచి ఔషధంలా పనిచేస్తుంది. రుచిగా ఉంది కదా అని అతిగా తింటే కొన్ని ఆరోగ్య సమస్యలు తప్పవని రీసెర్చ్ జర్నల్ ఆఫ్ ఫార్మసీ అండ్ టెక్నాలజీ వెల్లడించింది. మధుమేహ బాధితులు: పనస పండులో సహజ చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. అందుకే షుగర్ ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి. జీర్ణ సమస్యలు ఉన్నవారు: పనస పండు తిన్న తర్వాత కొందరిలో కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి. జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉన్నవారు దీనిని పరిమితంగా తీసుకోవాలి. గర్భిణీ స్త్రీలు: గర్భధారణ సమయంలో షుగర్ లెవల్స్ పెరిగే అవకాశం ఉన్నందున గర్భిణీలు పనస పండు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకే తీసుకోవడం ఉత్తమం. రక్తం గడ్డకట్టే సమస్యలు: బ్లడ్ కోగ్యులేషన్ సమస్య ఉన్నవారు పనస పండు తినకూడదు, ఇది ఆ పరిస్థితిని మరింత క్లిష్టతరం చేసే అవకాశం ఉంది. పనస పండు కేవలం రుచికరమైన పండు మాత్రమే కాదు, అది ఒక ఔషధం కూడా. అయితే ఏదైనా అతిగా తింటే నష్టమే. ఆరోగ్యంగా ఉన్నవారు కూడా మితంగా తీసుకుంటేనే పనస ప్రయోజనాలను పూర్తిగా పొందగలరు. మీకు ఏవైనా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉంటే నిపుణులను సంప్రదించిన తర్వాతే ఈ పండును మీ డైట్‌లో చేర్చుకోండి.

# రాగి పాత్రలో నీళ్లు తాగుతున్నారా?



మన పూర్వీకుల కాలం నుండి రాగి పాత్రల వినియోగం మన సంస్కృతిలో భాగమైంది. రాగి పాత్రలో రాత్రంతా ఉంచిన నీటిని తాగడం వల్ల శరీరానికి అనేక లాభాలు చేకూరుతాయి. అయితే, సరైన అవగాహన లేకపోతే అదే రాగి మీ ఆరోగ్యానికి శత్రువుగా మారుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాగి పాత్రలోని నీరు రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుందనేది నిజం. అయితే, దీనిని అతిగా లేదా తప్పుడు పద్ధతిలో వాడటం వల్ల కాపర్ టాక్సిసిటీ వచ్చే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాగి పాత్రలోని నీరు రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుందనేది నిజం. అయితే, దీనిని అతిగా లేదా తప్పుడు పద్ధతిలో వాడటం వల్ల ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అది ప్రాణాపాయం లేదా తీవ్ర అనారోగ్యానికి దారితీయవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాగిపాత్రలో నీరు తాగటానికి సరైన సమయం, పద్ధతి ఉన్నాయని చెబుతున్నారు. నీరు ఆరోగ్యానికి మంచిదే కదా అని రోజంతా రాగి పాత్రలోని నీటినే తాగకూడదు. శరీరానికి రోజుకు కొంత పరిమాణంలోనే రాగి అవసరమవుతుంది. అంతకు మించి తీసుకోవడం వల్ల కిడ్నీలపై భారం పడుతుంది. రాగి పాత్రలో ఎప్పుడూ నిమ్మరసం, వెనిగర్, పెరుగు లేదా మజ్జిగ వంటి పదార్థాలను ఉంచకూడదు. రాగిలోని లోహం పుల్లటి పదార్థాలలోని యాసిడ్లతో చర్య జరిపి విషపూరితమైన పదార్థాలను విడుదల చేస్తుంది. దీనివల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశం ఉంది. రాగి పాత్రలు లోపల నల్లగా లేదా ఆకుపచ్చగా మారినప్పుడు వాటిని వాడటం ప్రమాదకరం. ఆ ఆకుపచ్చని పొర శరీరంలోకి వెళితే తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు కలుగుతాయి. రాగి పాత్రలోని నీటిని తాగేందుకు సరైన సమయం ఉంటుంది. అందుకోసం రాత్రిపూట రాగి పాత్రలో నీటిని పోసి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు తాగడం అత్యంత ఉత్తమం. ఇది ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసులకు మించి రాగి నీటిని తీసుకోకపోవడం మంచిది. దీంతో పాటుగా రాగి పాత్రలను శుభ్రం ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యం. నిమ్మకాయ లేదా చింతపండుతో పాత్రను తరచుగా శుభ్రం చేస్తూ లోపలి భాగం మెరుస్తూ ఉండేలా చూసుకోవాలి. రాగి పాత్రలోని నీరు ఒక ఔషధం లాంటిది. ఔషధాన్ని పరిమితంగా తీసుకుంటేనే ఆరోగ్యం, అతిగా తీసుకుంటే అది విషం. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తూ రాగి వల్ల కలిగే పూర్తి ప్రయోజనాలను పొందొచ్చు.

# బొప్పాయి గింజలు.. పోషకాల గని



ప్రకృతి మనకు ప్రసాదించిన పండ్లలో బొప్పాయికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ధరలో ఎక్కువ పోషకాలు లభించే పండు ఏదైనా ఉందంటే అది బొప్పాయే. అయితే మనం పండును తిని, లోపల ఉండే నల్లటి గింజలను మాత్రం చెత్తబుట్టలో పారేస్తుంటాం. కానీ ఆ గింజలే సూపర్ ఫుడ్ అని మీకు తెలుసా? ప్రపంచవ్యాప్తంగా జరిగిన పలు ఆరోగ్య పరిశోధనల ప్రకారం, బొప్పాయి గింజలు అనేక మొండివ్యాధులను నయం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. జీర్ణక్రియ: బొప్పాయి గింజల్లో పాపైన్, ఖైమోపాపైన్ అనే శక్తివంతమైన ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి మనం తినే ఆహారంలోని ప్రోటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా జీర్ణక్రియ వేగవంతం అవుతుంది. అంతేకాకుండా పేగుల్లో ఉండే హానికరమైన నులిపురుగులు, పరాన్నజీవులను చంపే గుణం వీటికి ఉంది. ఇందులో పీచు పదార్థం అధికంగా ఉండటం వల్ల ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఫలితాలను ఇస్తుంది. కాలేయానికి సంజీవని: నేటి కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్ల వల్ల చాలామంది ఫ్యాటీ లివర్ లేదా లివర్ సిర్రోసిస్ బారిన పడుతున్నారు. బొప్పాయి గింజలు కాలేయాన్ని శుద్ధి చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ప్రతిరోజూ కొద్దిగా బొప్పాయి గింజల పొడిని నిమ్మరసంతో కలిపి తీసుకుంటే, కాలేయంలో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగిపోయి, దాని పనితీరు మెరుగుపడుతుంది. క్యాన్సర్: బొప్పాయి గింజల్లో ఉండే ఎసిటోజెనిన్ అనే సమ్మేళనం క్యాన్సర్ కణాలు వృద్ధి చెందకుండా అడ్డుకుంటుంది. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ల నివారణలో ఇవి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. శరీరంలోని వ్యర్థాలను వడపోసే కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే బొప్పాయి గింజలు మేలు చేస్తాయి. కిడ్నీ ఫెయిల్యూర్ వంటి తీవ్రమైన సమస్యల నుంచి రక్షించడమే కాకుండా ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి మూత్రపిండాల కణజాలాన్ని దృఢంగా మారుస్తాయి. అదేవిధంగా కీళ్ల నొప్పులు, వాపులు, ఆర్థరైటిస్ సమస్యలతో బాధపడేవారికి బొప్పాయి గింజలు ఒక సహజ ఔషధం. వీటిలో ఉండే విటమిన్ సి, ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ శరీరంలో కలిగే మంటను, నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ఎలా వాడాలి:

బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా, మిరియాల వంటి ఘాటును కలిగి ఉంటాయి. ఈ గింజలను ఎండబెట్టి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ పొడిని సలాడ్లు, స్మూతీలు లేదా సూప్‌లలో అర టీస్పూన్ చొప్పున కలుపుకోవచ్చు. నల్ల మిరియాలకు బదులుగా ఈ ఎండిన గింజలను గ్రైండ్ చేసి వంటల్లో వాడుకోవచ్చు. గింజల చేదును తగ్గించడానికి కొద్దిగా తేనెతో కలిపి నేరుగా కూడా తీసుకోవచ్చు.

## ముంబై ఇండియన్స్ జట్టులో విభేదాలు.. స్టేడియంలోనే హార్దిక్ Vs బుమ్రా మధ్య గొడవ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్-2026లో ఐదు సార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ కి ఈ సీజన్ లో ఏది కలిసిరావడం లేదు. గురువారం నాడు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో ముంబై ఘెర పరాజయం పాలైంది. ముంబై ఇండియన్స్ కి ఇది వరుసగా నాలుగో ఓటమి కావడం గమనార్హం. ముంబై పాయింట్ల పట్టికలో 8వ రెండో స్థానంలో కొనసాగుతోంది. కాగా వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్న ముంబై జట్టులో అంతర్గత విభేదాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తుంది. పంజాబ్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్లో కెప్టెన్ హార్దిక్ పాండ్యా- స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా మధ్య జరిగిన మాటల యుద్ధం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

196 పరుగుల భారీ లక్ష్య చేధనలో పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ దూకుడుగా ఆడుతూ క్రీజులో పాతుకుపోయాడు. అతడ్ని ఔట్ చేసేందుకు హార్దిక్ తీవ్రంగా ప్రయత్నించాడు. అయినప్పటికి ఫలితం మాత్రం లభించలేదు. దీంతో పాండ్యా తన సహనాన్ని కోల్పోయాడు. బుమ్రా బౌలింగ్ చేస్తున్నప్పుడు హార్దిక్ పదే పదే ఫీల్డర్లను మారుస్తూ విసిగించాడు. తన బౌలింగ్ కి తగ్గట్టుగా ఫీల్డింగ్ పెట్టుకునే ఛాన్స్ ఇవ్వకుండా, హార్దిక్ జోక్యం చేసుకోవడం బుమ్రాకు నచ్చలేదు.. హార్దిక్ పాండ్యా చేసిన ఓవరాక్షన్ అతడికి ఏమాత్రం నచ్చలేదు. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది.

బుమ్రా అసహనంతో నీవు నాకు చెప్పొద్దు అన్నట్లు చేసిన సైగలు చేసినప్పటికీ, ఏదేమైనప్పటికి చివరికి కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిర్ణయానికే బుమ్రా తలవంచాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా ఈ ఏడాది ఐపీఎల్ 2026లో బుమ్రా దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ భారత పేస్ గుర్రం ఇప్పటి వరకు 5 మ్యాచ్లు ఆడి ఒక్క వికెట్ కూడా తీయలేదు.

## టీ20 వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. కెనడా కెప్టెన్‌పై ఐసీసీ విచారణ!






**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ప్రపంచాన్ని మ్యాచ్ ఫిక్సింగ్ భూతం మరోసారి వణికిస్తోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. కెనడా, న్యూజిలాండ్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా కెనడా జట్టు ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించిందని, దీనిపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విచారణ ప్రారంభించిందని ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో తన కథనంలో వెల్లడించింది.కెనడాకు చెందిన 'ది ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్.. 'కరప్షన్, క్రైమ్ అండ్ క్రికెట్' పేరుతో రూపొందించిన ఒక డాక్యుమెంటరీ ఈ సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నీలో చెన్నై వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో కెనడా జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్‌పై ప్రధానంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.ఆ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 173 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బౌలింగ్‌కు దిగిన కెనడా పేసర్లు తొలి రెండు ఓవర్లలో 35 పరుగులు ఇచ్చారు. మూడో ఓవర్ వేసిన స్పిన్నర్ సాద్ బిన్ జాఫర్ వికెట్ తీసి ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా మెయిడెన్ ఓవర్ పూర్తి చేశాడు. ఇలాంటి కీలక సమయంలో ఐదో ఓవర్ వేయడానికి కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా స్వయంగా బంతిని అందుకున్నాడు. ఆ ఓవర్లో ఒక నో-బాల్, రెండు వైడ్లతో సహా ఏకంగా 15 పరుగులు సమర్పించుకున్నాడు. ఉద్దేశపూర్వకంగానే ఆ ఓవర్లో భారీగా పరుగులు ఇచ్చారనేది ప్రధాన ఆరోపణ.కేవలం ఈ ఒక్క ఆరోపణే కాకుండా కెనడా క్రికెట్ బోర్డుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) మరికొన్ని విచారణలు కూడా జరుపుతోంది. జాతీయ జట్టులో కొందరు ఆటగాళ్లను ఎంపిక చేయాలని కోచ్ ఖుర్రం చౌహాన్, బోర్డు సభ్యులు ఒత్తిడి చేసినట్లుగా ఉన్న ఒక ఫోన్ కాల్ ఆడియో గతంలో లీక్ అయింది. దీనిపైనా ఏసీయూ దర్యాప్తు చేస్తోంది.ఈ ఆరోపణలపై ఐసీసీ ఇంటిగ్రిటీ యూనిట్ జనరల్ మేనేజర్ ఆండ్రూ ఎఫ్‌గ్రేవ్ స్పందించారు. ఈ డాక్యుమెంటరీ విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే విచారణ దశలో ఉన్న అంశాలపై తాము ఎలాంటి వ్యాఖ్యలు చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ఐసీసీ నిబంధనల ప్రకారం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆరోపణలతో కెనడా క్రికెట్ బోర్డుతో పాటు టీ20 ప్రపంచకప్ పారదర్శకతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

## శ్రేయస్ క్యాచ్‌కు సచిన్ ఫిదా.. అద్భుతమంటూ కితాబు




**హైదరాబాద్ పెన్ పవర్:** గత రాత్రి ముంబై ఇండియన్స్ తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆ క్యాచ్‌ను, తాను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఒకటిగా అభివర్ణించాడు. కేవలం అథ్లెటిజం మాత్రమే కాదని, దాని వెనుక అద్భుతమైన అవగాహన, సమయస్ఫూర్తి ఉన్నాయని సచిన్ ప్రత్యేకంగా విశ్లేషించాడు.శ్రేయస్ అయ్యర్ క్యాచ్ గురించి సచిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ... "బంతి వేగాన్ని, ఎత్తును అంచనా వేయడం, బౌండరీ లైన్ ఎక్కడుందో గమనించుకోవడం, దాన్ని తొక్కకుండా సరైన సమయంలో గాల్లోకి లేవడం.. ఇవన్నీ అద్భుతం. అంతటితో ఆగకుండా, గాల్లో ఉండగానే బంతిని పట్టుకుని, కిందపడేలోపు తన సహచర ఫీల్డర్‌కు అందించాడు. ఆ సమయంలో తన టీమ్‌మేట్ ఎక్కడున్నాడో కూడా కచ్చితంగా తెలిసి ఉండాలి. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది" అని వివరించారు.ఇలాంటి ఫీట్ చేయాలంటే నమ్మశక్యంకాని అవగాహన, టైమింగ్, ఫిట్‌నెస్, సంయమనం అవసరమని సచిన్ తెలిపారు. "శ్రేయస్ అయ్యర్ అన్నింటినీ కచ్చితంగా అంచనా వేశాడు. నేను ప్రత్యక్షంగా చూసిన అత్యుత్తమ క్యాచ్‌లలో ఇది కచ్చితంగా ఒకటి" అని సచిన్ కొనియాడారు.

## పెళ్లి ఆలస్యంతో సమాజాన్ని జయించినట్లేనా?



క్లాసిక్ ఆఫ్-వైట్ చీర లుక్‌లో ప్రగ్యా నాగ్రా స్టన్స్



నటి కృతికా కమ్రా వివాహ బంధం - వ్యక్తిగత నిర్ణయాల పై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సాధారణంగా సమాజంలో వయసు రాగానే పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి ఉంటుంది. కానీ తాను 37 ఏళ్ల వయసులో వివాహం చేసుకోవడాన్ని సరైన నిర్ణయంగా అభివర్ణించారు. జీవితంలో ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం వల్ల ఎంచుకున్న భాగస్వామి పట్ల, నిర్ణయం పట్ల సంపూర్ణమైన స్పష్టత ఉంటుందన్నారు. ఆ సమయంలో ఏం చేస్తున్నామో? బాగా తెలుస్తుందని విశ్లేషించారు. తన స్నేహితులందరికీ పదేళ్ల క్రితమే వివాహాలు అయిపోయాయని గుర్తు చేసుకుంటూ వారంతా ఓ రకమైన సామాజిక ఒత్తిడి వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే కృతిక తల్లిదండ్రులు పెళ్లి విషయంలో ఎన్నడూ తనని ఒత్తిడి చేయలేదని దీంతో కావాల్సినంత సమయం దొరికిందన్నారు. కెరీర్ , వ్యక్తిగత జీవితంపై పూర్తి అవగాహన వచ్చిన తర్వాతే తాను వైవాహిక బంధంలోకి అడుగుపెట్టానని ఇది తనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తుందన్నారు. గౌరవ్ కపూర్ - కృతికల వివాహం ఎంతో నిరాడంబరంగా కేవలం సన్నిహితుల మధ్య జరిగింది. భారీ హంగులు, డెస్టినేషన్ వెడ్డింగ్ వంటి ఆర్భాటాలకు తాము దూరంగా ఉన్నామన్నారు. -మాకు పెళ్లి వేడుక కంటే వివాహ బంధం అనేది చాలా పెద్ద విషయం అని స్పష్టం చేశారు. లోకానికి చూపించుకోవడానికి చేసే ఖర్చు కంటే ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితాన్ని పంచుకోవాలనే ఉద్దేశం బలంగా ఉండాలని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే పెళ్లి సమయంలో తన భర్త గౌరవ్ కపూర్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని కృతిక గుర్తు చేసుకున్నారు. నిత్యం వందలాది మంది ముందు లైవ్ షోలు ఇచ్చే గౌరవ్, తమ వివాహ సమయంలో కన్నీళ్లు పెట్టుకోవడం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. కృతికను వధువు రూపంలో చూడగానే గౌరవ్ కళ్లలో నీళ్లు తిరగడం, ఆ బంధం పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు.తన ప్రాణ స్నేహితుడిని భర్తగా పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెళ్లి అనేది వ్యక్తిగత నిర్ణయమని అది ఎప్పుడు చేసుకోవాలనేది సదరు వ్యక్తులే నిర్ణయించుకోవాలని కృతిక సూచించారు. వయసును బట్టి కాకుండా మానసిక సిద్ధతను బట్టి అడుగు వేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే మరోవైపు వైవాహిక జీవితాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నానన్నారు.

పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అంటే సమాజాన్ని ఓడించినట్లు కాదు. సమాజపు అసంబద్ధమైన ఒత్తిడికి తలొగ్గకుండా ఉండటమే. జీవితానికి మనం యజమానులమని, మన నిర్ణయాలు మనం తీసుకోగలమని నిరూపించడమే అసలైన విజయం. ఇది ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు గౌరవించుకుంటూ కలిసి ఉండాలని నిర్ణయించుకున్నప్పుడే ఆ వివాహం విజయవంతం అవుతుంది.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్ లేస్ మరియు పెర్ల్స్‌లో సొగసుగా, అభిమానులను విస్మయానికి గురి చేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965